## పాకిస్థాన్ కీలక సంస్థలపై అమెరికా ఆంక్షలు

న్యూఢిల్లీ : పాకిస్థాన్ ప్రభుత్వానికి అగ్రరాజ్యం అమెరికా షాకిచ్చింది. పాక్ ప్రభుత్వ రంగ సంస్థతో పాటు నాలుగు కీలక సంస్థలపై ఆంక్షలు విధిస్తున్నట్లు ప్రకటించింది. దీర్ఘ శ్రేణి క్షిపణి సాంకేతికత వ్యాప్తికి సహ కరిసున్నాయని, సామూహిక జన హనన ఆయుధాల తయారీకి సాయపడుతున్నాయని ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే నేషనల్ డెవలప్‌మెంట్ కాంప్లెక్స్ (ఎన్ డీసీ) కూడా ఉంది. ఇది పాక్ బాలిస్టిక్ మిసైల్ కార్యక్రమానికి సహకరి స్తోందని ఆరోపించింది. ఇది సామూహిక జనహనన ఆయుధాలను వ్యాప్తి చేస్తోందని పేర్కొంది. ఈ నేపథ్యం లోనే పాక్ నేషనల్ డెవలప్‌మెంట్ కాంప్లెక్స్ సహా నాలుగు కంపెనీలపై ఆంక్షలు విధించినట్లు తెలిపింది. దీంతో పాటు కరాచీ కేంద్రంగా పనిచేస్తున్న అక్తర్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అఫిలియేట్స్ ఇంటర్నేషనల్, రాక్‌సైడ్ ఎంటర్‌ప్రైజెస్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. క్షిపణి ప్రయోగానికి వినియోగించే పరికరాలను ఎన్ డీసీ కొనుగోలు చేస్తోందని, షాహిన్ శ్రేణి క్షిపణుల తయారీలో చురుగ్గా పాల్గొందని అమెరికా వెల్లడించింది. ఈ పరికరాల తయారీకి అవసరమైన ముడిపదార్థాలను ఎన్ డీసీకి అక్తర్ అండ్ సన్స్ సంస్థ సరఫరా చేస్తోందని తెలిపింది. ఎన్ డీసీ తరఫున మిసైల్ లో వినియోగించే పలు పరికరాలను అఫిలియేట్ ఇంటర్నేషనల్ కొనుగోలు చేస్తోందని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూమిల్లర్ చెప్పారు. కాగా, తమ సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించడం దురదృష్టకరమని, పక్షపాతంతో కూడుకున్నవని పాక్ ప్రభుత్వం పేర్కొంది.

## ఎస్‌బీఐ ఎండీగా తెలుగు వ్యక్తి రామమోహన్ రావు అమర

ఢిల్లీ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మేనేజింగ్ డైరెక్టర్ పదవికి తెలుగు వ్యక్తి రామమోహన్ రావు అమరను నియమిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన మూడేళ్ల పాటు బ్యాంక్ ఎండీగా కొనసాగనున్నారు. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ అయింది. ఇక సంస్థ ప్రస్తుత ఛైర్మన్ సీఎస్ శెట్టి కూడా తెలుగు వారే కావడం గమనార్హం. ఆయన ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో ఏర్పడిన ఖాళీని రామమోహన్ రావు భర్తీ చేయనున్నారు. కాగా, ఎస్‌బీఐ బోర్డుకు నలుగురు మేనేజింగ్ డైరెక్టర్లు, ఒక ఛైర్మన్ నాయకత్వం వహిస్తారు. అమరా ఎంపికతో ఎస్‌బీఐ నాలుగో ఎండీ పోస్టు భర్తీ అయింది. ఇక ఎస్‌బిఐ మేనేజింగ్ డైరెక్టర్ పదవికి తొమ్మిది మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసినట్లు ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇనిస్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) వెల్లడించింది. చివరికి ఎండీ పదవికి రామ మోహన్ రావును సిఫార్సు చేసింది.

రామమోహన్ రావుకు ఎస్‌బీఐతో 29 ఏళ్ల అనుబంధం

రామ మోహన్ రావు అమర ఒక అనుభవజ్ఞుడైన బ్యాంకర్. ఆయనస్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 29 ఏళ్ల అను బంధాన్ని కలిగి ఉన్నారు. గతంలో ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ (ఎస్‌బీఐ కార్డ్) ఎండీ, సీ ఈఓగా పనిచేశారు. అమరా 1991లో ప్రొబేషనరీ ఆఫీసర్ (పీఓ)గా ఎస్‌బీఐలో బ్యాంకింగ్ కెరీర్‌ను ప్రారంభించారు. ఆయనకు ఇండియా, విదేశాలలో క్రెడిట్, రిస్క్ మరియు అంతర్జాతీయ బ్యాంకింగ్ రంగంలో అపారమైన అను భవం, నైపుణ్యం ఉన్నాయి.రామమోహన్ రావు ఎస్‌బీఐకి సంబంధించి విదేశీ పోస్టింగ్‌లను కూడా నిర్వహించడం జరిగింది. మొదట సింగపూర్‌లో ఎస్‌బీఐ బ్రాంచీ సీఈఓగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తరువాత చికాగో బ్రాంచ్‌కి సీఈఓగా పనిచేశారు. అలాగే ఎస్‌బీఐ కాలిఫోర్నియా బ్రాంచి అధ్యక్షుడు, సీఈఓగా ఉన్నారు.

## కుల్గాంలో భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు ఉగ్రవాదుల హతం

న్యూఢిల్లీ : జమ్మూకశ్మీర్‌లోని కుల్గాంలో ఈ ఉదయం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ఉగ్రవాదుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న అనంతరం వారిని గుర్తిస్తామని ఆర్మీ అధికారులు తెలిపారు. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాంలోని ఓ ఇంట్లో నలుగురైదుగురు ఉగ్రవాదులు తలదాచుకున్నట్టు సమాచారం అందుకున్న జమ్మూకశ్మీర్ పోలీసులు, ఆర్మీ అధికారులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు. ఉగ్రవాదులు తలదాచుకున్న ఇంటిని భద్రతా బలగాలు చుట్టుముట్టడాన్ని గ్రహించిన తీవ్రవాదులు బయటకు వచ్చి విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది ఎదురుకాల్పులు ప్రారంభించారు. కాల్పులు ఆగిన తర్వాత చూస్తే ఐదుగురు ఉగ్రవాదుల మృతదేహాలు కనిపించాయి. ఈ ఏడాది కుల్గాంలో జరిగిన రెండో అతిపెద్ద ఎన్‌కౌంటర్ ఇదేనని అధికారులు తెలిపారు. జులై 8న ఇక్కడ జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఆరుగురు మిలిటెంట్లు హతమవగా ఇద్దరు సైనికులు అమరులయ్యారు.

## మేం జగనన్న సైనికులం..ఎవరికీ భయపడం: రోజా

మొదటి పేజి తరువాయి

కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. ఈ ఆరు నెలల కాలంలో వైసీపీ నేతల ఇళ్ల ముందు గుమ్మాలు కొట్టడం, పొలాలకు అడ్డంగా గోడలు కట్టడం తప్ప వారు ఇచ్చిన సూపర్ సిక్స్ సహా ఇతర హామీల అమలుపై కనీసం ఆలోచన కూడా చేయడంలేదన్నారు. వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రభుత్వం ఎలా మోసం చేస్తోందో ప్రజలకు అర్థమైందని అన్నారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని, తప్పుడు కేసులు బనాయించి భయాందోళనలకు గురిచేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అయితే, భయమనేది తమ నాయకుడు జగన్ బ్లడ్ లోనే లేదని, ఆయన వెంట నడిచే సైనికులుగా తాము కూడా ఎవరికీ భయపడబోమని పేర్కొన్నారు. ప్రభుత్వ వేధింపులకు భయపడి ప్రశ్నించడం మానుకోబోమని స్పష్టం చేశారు. నగరి నియోజకవర్గంలోని వైసీపీ నేతలు, కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి కోసం ఎవరితోనైనా ఎంతవరకైనా పోరాడేందుకు సిద్ధమని చెప్పారు. మేం జగనన్న సైనికులం.. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఎవరమూ ఎలాంటి తప్పుచేయలేదని రోజా చెప్పారు. గతంలో పద్నాలుగేళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఏమీ చేయలేదని విమర్శించారు. మోసాలకు పాల్పడి, ఈవీఎంలను టాంపరింగ్ చేసి కూటమి అధికారంలోకి వచ్చిందని రోజా ఆరోపించారు. కూటమి ప్రభుత్వ హనీమూన్ కాలం అయిపోయిందని, ఇకపై ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలపై గట్టిగా ప్రశ్నిస్తామని హెచ్చరించారు. నీతిమాలిన రాజకీయాలను వైసీపీ నేతలు అందరమూ కలిసి ఎదుర్కొంటామని చెప్పారు. టీడీపీ నాయకుల ఒత్తిడికో, తప్పుడు ఆదేశాలకో లోబడి చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారులపై హెరాస్ మెంట్ కేసులు వేసి కోర్టులో నిలబెడతామని రోజా హెచ్చరించారు.

## మంత్రి నిమ్మల రామానాయుడుకి హరిరామ జోగయ్య లేఖ

అమరావతి : పాలకొల్లు నియోజకవర్గంలో 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాలని కోరుతూ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ శ్రీనివాస్ వర్మకు మాజీ మంత్రి, కాపు నేత హరిరామ జోగయ్య లేఖ రాశారు. అభివృద్ధి అంటే పరిపాలన భవనాలు, నివాస భవనాలు, పార్కులు, విశ్రాంతి భవనాలు నిర్మించడానికి ప్రాధాన్యత ఇవ్వడం కాదని... స్వచ్ఛమైన తాగునీరు, విద్య, వైద్యం, ఆరోగ్యం, రోడ్ల నిర్మాణం, సాగు నీరు, మురుగు కాలువల నిర్మాణం కూడా అతి ముఖ్యమైనవని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రాధాన్యతలు వేరుగా ఉన్నాయని విమర్శించారు. రాజ్య భవనాలు, నివాస, పరిపాలన భవనాల నిర్మాణాల పేరుతో కోట్ల రూపాయలను ఖర్చు చేయడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని జోగయ్య విమర్శించారు. ఇది నిజమైన అభివృద్ధి అనిపించుకోదని చెప్పారు. నరసాపురం, భీమవరం, రాజోలు నియోజకవర్గాలకు సమదూరంలో ఉన్న పాలకొల్లు నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎవరికైనా పెద్ద వైద్య అవసరం వస్తే హైదరాబాద్ కు కానీ, వైజాగ్ కు కానీ వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. ఆ ఇబ్బందుల నుంచి బయటపడటానికి ఆరోగ్యశ్రీ సదుపాయం కలిగిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అవసరం ఉందని తెలిపారు. దీనికి ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు.ం

## ఏ హోదాతో హరీశ్ రావు మాట్లాడుతున్నారు?: కోమటిరెడ్డి

మొదటి పేజి తరువాయి



బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. హరీశ్ రావు ఏ హోదాతో ప్రశ్నలు అడుగుతున్నారని కోమటిరెడ్డి ప్రశ్నించారు. ఆరోజు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే ప్రశ్నోత్తరాల కార్యక్రమం మొదలయింది. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ... అసలు హరీశ్ రావు ఎవరని ప్రశ్నించారు. డిప్యూటీ లీడరా? ఎమ్మెల్యేనా? ఏ హోదాతో మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎక్కడున్నారని అడిగారు. నల్గొండ గురించి, తన గురించి మాట్లాడే హక్కు హరీశ్ కు లేదని చెప్పారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీని పట్టించుకోలేదని విమర్శించారు. నిన్న కూడా కోమటిరెడ్డి, హరీశ్ మధ్య మాటల యుద్ధం కొనసాగిన సంగతి తెలిసిందే.

# జగన్ సైతం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే అవకాశాలు

మొదటి పేజి తరువాయి





షర్మిల అన్నది కూడా కాస్తా నిశితంగా విశ్లేషించిన వారికి అర్థం అయ్యే విషయం. జగన్ ని కోర్టు దాకా నడిపించాలని కూడా ఆమెకు కోరిక ఉన్నట్లుగా తాజాగా అదానీ ముడుపుల విషయంలో ఆమె చేసిన ప్రకటనలు తెలియచేస్తున్నాయని అంటున్నారు.షర్మిలను ఏ ముహూర్తాన ఏపీసీసీ చీఫ్ గా చేశారో కానీ ఆమె జగన్ మీదనే తన మొత్తం బాణాలను ఎక్కుపెడుతున్నారు. అంతే కాదు ఆమె జగన్ వదిలిన బాణాన్ని అని ఒకనాడు చెప్పుకుని ఇపుడు అదే బాణం ఆయనకే గుచ్చేస్తున్నారు. ఆమెను కాంగ్రెస్ చీఫ్ గా నియమించడం వెనక అధినాయకత్వం ఆశించినది వేరు అయితే ఆమె చేస్తున్నది వేరు అని అంటున్నారు.ఇక ఈ విషయంలో పూర్తిగా విసిగిన ఏపీ కాంగ్రెస్ సీనియర్ నేతలు అయితే హై కమాండ్ కి చెప్పాల్సినవి అన్నీ చెప్పేశారు అని అంటున్నారు. వాటిలో కాంగ్రెస్ పెద్దలకు పూర్తిగా డిస్టర్బ్ చేసినది బాగా హర్ట్ చేసినది ఏంటి అంటే ఏపీలో బీజేపీతో కలసి పొత్తులు పెట్టుకున్న చంద్రబాబు సర్కార్ మీద షర్మిల అంతగా పోరాడడం లేదన్నది.బీజేపీ అంటే అంతెత్తున లేచే జాతీయ కాంగ్రెస్ నేతలకు ఈ ఒక్క పాయింట్ మాత్రం అసలు మింగుడుపడటం లేదు అని అంటున్నారు. ఏపీ ప్రభుత్వంలో బీజేపీ మంత్రి ఉన్నారు. కేంద్రంలో టీడీపీ ఉంది. అలా చంద్రబాబు బీజేపీతో కలసి ఉన్న వేళ ఆయన మీద సాఫ్ట్ కార్నర్ చూపించాల్సిన అవసరం ఏంటి అన్నదే ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు పట్టుకున్న విషయం అని అంటున్నారు.దాంతో పాటు జగన్ ని ఇండియా కూటమిలోకి రప్పించాలని కూడా ఏపీలో సీనియర్ కాంగ్రెస్ నేతలు కేంద్ర పెద్దలకు చెప్పారని అంటున్నారు. ఏపీలో ఇప్పట్లో అయితే కాంగ్రెస్ సొంతంగా పోటీ చేసి గెలిచింది ఉండదని కూడా వారు వివరించారు అని అంటున్నారు. చంద్రబాబు అయితే వచ్చే ఎన్నికలలో సైతం బీజేపీతోనే పొత్తులతో వెళ్తారని అందువల్ల ఏపీలో జగన్ ఆల్టరేషన్ అన్నది కూడా వారు తెలియచేశారు అని అంటున్నారు.ఇక జగన్ ని మచ్చిక చేసుకోవాలీ అంటే ఆయన మీద సొంత కుటుంబంలోని వ్యక్తిని ప్రయోగించి ఇబ్బంది పెట్టారు అన్న ఆగ్రహం కాంగ్రెస్ వైపు నుంచి ఉండరాదని కూడా సీనియర్లు చెప్పారని అంటున్నారు. పైగా షర్మిల వల్ల ఏపీ కాంగ్రెస్ ఎత్తి గిల్లడం లేదని కూడా డేటాతో సహా వివరించారని అంటున్నారు. మరో వైపు చూస్తే వైసీపీకి రాయలసీమలో ఆదరణ ఉందని, అలాగే కొన్ని సామాజిక వర్గాలలో అనుకూలత ఉందని అంటున్నారు.అదే టైం లో గోదావరి జిల్లాలో ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొంటోందని కూడా కాంగ్రెస్ సీనియర్లు విశ్లేషించి హైకమాండ్ కి చెప్పారని అంటున్నారు. ముఖ్యంగా కాపులలో ఎక్కువ మొగ్గు కూటమి వైపు మళ్ళిందని అందువల్ల దానిని సెట్ చేసుకునే ప్రయత్నంలో వైసీపీ ఉందని చెబుతున్నారు.అదే సమయంలో కాంగ్రెస్ వైపు నుంచి కాపులను ఆకట్టుకోవడానికి పీసీసీ చీఫ్ ఆ సామాజిక వర్గానికి ఇవ్వాలని కూడా సూచించారు అని అంటున్నారు. అలాగే గోదావరి జిల్లాలకు చెందిన వ్యక్తికి ఇస్తే కచ్చితంగా ఏపీలో కాంగ్రెస్ కి గుర్తింపు వస్తుందని జగన్ సైతం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉంటాయని వివరించారని అంటున్నారు.ఇక హైకమాండ్ కూడా ఏపీ పైన ఫోకస్ పెట్టిందని షర్మిల పనితీరు మీద వారు కూడా మథింపు చేశారని అంటున్నారు షర్మిలను తప్పించి కొత్తవారికి చాన్స్ ఇవ్వాలన్న ప్రతిపాదనను కూడా సీరియస్ గానే పరిశీలిస్తున్నారు అని అంటున్నారు. జగన్ ని తమ వైపు రప్పించుకుంటే 2029 ఎన్నికలలో కాంగ్రెస్ కి ఏపీలో కొన్ని సీట్లు అయినా దక్కుతాయని ఆ విధంగా పొత్తులకు జగన్ వైపు నుంచి సానుకూలత వ్యక్తం కావాలంటే అర్జంటుగా కొత్త నాయకత్వాన్ని జగన్ మెచ్చే నాయకుడిని ఏపీసీసీ ప్రెసిడెంట్ గా నియమించడం ఒక్కటే మార్గమని సీనియర్లు చెప్పారని అంటున్నారు.మొత్తం మీద చూస్తే షర్మిలకు కొత్త ఏడాదిలో పదవీ గండం పొంచి ఉందని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అదే జరిగితే ఆమె రాజకీయ ఉత్సాహం ఆమె ఆరాటం పోరాటం కూడా ఏమవుతాయన్నది కూడా చర్చగా ఉంది. మొత్తానికి జగన్ కి ఇష్టమైన నిర్ణయమే కాంగ్రెస్ తీసుకుంటుందని వస్తున్న వార్తలలో నిజమెంత అనేది కొత్త ఏడాదిలోనే తెలుస్తుంది అని అంటున్నారు.

## మంత్రులే ప్రశ్నలు అడిగితే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుంది: హరీశ్‌రావు

మొదటి పేజి తరువాయి

ఆయనకు అడిగే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు సూచించారు. అనంతరం హరీశ్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అతిఎక్కువ పాలించింది కాంగ్రెస్ పార్టీ. నేడు మూసీ వల్ల నల్లగొండ జిల్లా ప్రజలు బాధపడుతున్నారంటే దానికి ప్రధాన ముద్దాయి కాంగ్రెస్ పార్టీయే నన్నారు. ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 పనులు పూర్తిచేసి కాళేశ్వరం జలాలను నల్లగొండ జిల్లా, సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ ప్రజలకు అందించేదే బీఆర్ఎస్ పార్టీ అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందే, తాము ఏం చేశామో చర్చ పెట్టాలన్నారు. ప్రశ్నోత్తరాల్లో ప్రశ్నకు సూటిగా జవాబు వచ్చినట్లయితే పది ప్రశ్నలకు ఆన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజు మూడు నాలుగు ప్రశ్నలకే సభాసమయం సరిపోతుందని, ఒక్కో ప్రశ్నకు సూటిగా సమాధానం వచ్చేలా చూడాలన్నారు. మంత్రులు లేచి రాజకీయ ప్రసంగాలు చేస్తే తాము కల్పించుకోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వాటికి మరోసారి అవకాశం ఇవ్వొద్దని స్పీకర్‌ను కోరారు.

## పోరాటాలకు సమయం ఆసన్నమయింది...

మొదటి పేజి తరువాయి



ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ప్రతినిధులు, పార్టీ నేతలతో జగన్ బేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంపై మనమంతా పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్న మ యిందని జగన్ అన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత వైసీపీకి అనుకూలంగా మారాలంటే ప్రజా సమస్యలపై కలిసికట్టుగా పోరాటం చేయాలని చెప్పారు. ప్రజల తరపున మనం గొంతు విప్పాలని పిలుపునిచ్చారు. నాయకులుగా ఎదగడానికి మీకు ఇదొక అవకాశం అని చెప్పారు. మన ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి మనం ఎంతో చేశామని జగన్ చెప్పారు. అంతకంటే ఎక్కువ చేస్తానని చెప్పి ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరికీ చంద్రబాబు హామీలు ఇచ్చారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. వైసీపీ హయాంలో మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని అమలు చేశామని జగన్ చెప్పారు. మేనిఫెస్టోకు పవిత్రతను తీసుకొచ్చామని తెలిపారు. కరోనా వచ్చినా, ప్రభుత్వ ఆదాయం తగ్గినా, ఖర్చులు పెరిగినా సాకులు చూపకుండా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను, వాగ్దానాలను అమలు చేశామని చెప్పారు. తప్పుడు హామీలతో ప్రజలను చంద్రబాబు నమ్మించగలిగారని... జగన్ చేశారు కదా... చంద్రబాబు కూడా చేస్తారేమోనని ప్రజలు నమ్మారని... అందుకే మనం పరాజయం చెందామని అన్నారు. ఆరు నెలలు గడవకుండానే చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించారని చెప్పారు. చంద్రముఖిని లేపడమంటే పులి నోట్లో తల పెట్టడమేనని ఆరోజు చెప్పానని... ఈరోజు దాన్ని చంద్రబాబు నిజం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు బిర్యానీ పెడతానన్నారని... ఇప్పుడు బిర్యానీ పోయింది, పలావు కూడా పోయిందని ఎద్దేవా చేశారు. ప్రజలకు పథకాలు అందడం లేదని చెప్పారు. కరెంటు ఛార్జీల రూపంలో ప్రజలపై వేల కోట్ల భారాన్ని వేశారని మండిపడ్డారు. స్కామ్ ల మీద స్కామ్ లు నడుస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని చెప్పారు.

## అంబేద్కర్ రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తెచ్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోంది: షర్మిల

అమరావతి : దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీలు దైవంగా పూజించే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను బీజేపీ అవమానించిందంటూ ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల మండిపడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు ఆ పార్టీ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.

అంబేద్కర్ పై వ్యాఖ్య లతో దళితులు, గిరిజనుల మనో భావాలను అమిత్ షా దెబ్బతీశారని ఆరోపించారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతిని అమలు చేసేందుకు సంఘ్ పరివార్ తో కలిసి బీజేపీ కుట్రలు పన్నుతోందని షర్మిల సంచలన ఆరోపణలు చేశారు.

మనుస్మృతిని విశ్వసిస్తుంది కాబట్టే బీజేపీ అనుక్షణం రాజ్యాంగంపై దాడికి పాల్పడుతోందని అన్నారు. బహిరంగ సభా వేదికలతో పాటు సాక్షాత్తూ పార్లమెంట్ లోనే అంబేద్కర్ ను అవమానిస్తున్నారని, హేళన చేస్తున్నారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యసభలో అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా, ఏఐసీసీ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ లో పలు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్ షర్మిల తెలిపారు.

## భూభారతి చట్టం ప్రకటనలపై.. బీఆర్ఎస్ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు

మొదటి పేజి తరువాయి

డిసెంబర్ 19న (గురువారం) దినపత్రికల్లో చట్టానికి సంబంధించి ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చిందని, ఆమోదం పొందని బిల్లును చట్టంగా ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో భారీ ప్రకటనల ద్వారా ప్రజలను ప్రభుత్వం తప్పుదోవ పట్టించిందని పేర్కొంది. శాసనసభలో చర్చ దశలో ఉన్న బిల్లును చట్టంగా పేర్కొనడంతో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 245 ప్రకారం సభా హక్కులకు హాని జరిగిందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త రెవెన్యూ చట్టం 'భూ భారతి'తో రెవెన్యూ రికార్డుల నిర్వహణలో అనేక మార్పులు జరగనున్నాయి. రాష్ట్రంలోని ప్రతి భూ కమతానికి ఆధార్ తరహాలో 'భూదార్' నంబర్‌ను కేటాయించనున్నారు. ఇకపై భూ క్రయవిక్రయాలు జరిపే సమయంలో ముందుగా ఆ భూమిని సర్వే చేయించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. ధరణి పోర్టల్‌లో అందుబాటులో ఉన్న 'ఇన్‌స్టెంట్ మ్యుటేషన్'ను కొ త్త చట్టంలోనూ కొనసాగించారు. క్రయవిక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక మ్యుటేషన్ కూడా పూర్తవుతుంది. కానీ, వారసత్వంగా జరిగే భూముల బదిలీ (ఫౌతీ)లో కొత్త నిబంధన తీసుకొచ్చారు. తాసిల్దార్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ జరిగినా.. మ్యుటేషన్ చేసే అధికారాన్ని మాత్రం ఆర్డీవోకు అప్పగించారు. నిర్ణీత కాలంపాటు (30 రోజులు) మ్యుటేషన్ చేయకుండా నిలిపివేస్తారు. ఆలోగా ఆ భూమి పై ఎలాంటి ఫిర్యాదులు రాకపోతే ప్రక్రియ పూర్తి చేస్తారు. కోర్టు ద్వారా వచ్చే, ఓఆర్సీ, 38–ఈ తదితర మొత్తం 14 రకాల భూమి హకులపై మ్యుటేషన్ అధికారాలను ఆర్డీవోకు కట్టబెట్టారు. ఇప్పటివరకు ధరణి పోర్టల్‌లో మొత్తం 33 మాడ్యూళ్లు ఉండగా.. భూభారతిలో వాటిని 6కు తగ్గించనున్నారు. భూమి పట్టాలో కేవలం రైతు పేరు మాత్రమే ఉండగా.. ఇకపై అనుభవదారు కాలమ్ సహా మొత్తం 11 కాలమ్‌లు ఉంటాయి. పార్ట్–బీ కేసులు పరిష్కారమైనవారి వివరాలను భూ రికార్డుల్లో ఎక్కించి, పాస్ బుక్ ఇచ్చేలా మార్పులు చేశారు. తాసిల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు అధికారం ఇచ్చారు. సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. గ్రామ కంఠం, ఆబాదీలకు హకుల రికార్డును రూపొందిస్తుంది. 2014 వరకు సబ్ రిజిస్ట్రార్ల వద్ద రికార్డుల్లో ఉన్న 'ప్రభుత్వ భూముల' వివరాలను ప్రస్తుతం ధరణిలో ఉన్న డాటాతో సరిపోల్చనున్నట్టు ప్రభుత్వం చెప్తున్నది. ఆయా సర్వే నంబర్లలోని భూములన్నింటినీ ప్రభుత్వ భూములుగా పరిగణించి నిషేధిత జాబితాలో చేర్చుతామని తెలిపింది. దీంతో 2014కు ముందు పొరపాటున ప్రభుత్వ భూమిగా నమోదై.. 2014 తర్వాత వివాదం ముగిసి, పట్టాభూమిగా మారిన భూములన్నీ ఇప్పుడు మళ్లీ నిషేధిత జాబితాలోకి చేరనున్నాయి. కొత్త రెవెన్యూ చట్టానికి సంబంధించిన నియమ నిబంధనలను 3 నెలల్లో తీసుకురానున్నారు.

# ధరణి పోర్టల్ లో పెద్ద ఎత్తున దందా...

మొదటి పేజి తరువాయి




దీంతో రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేసినట్లుగా.. ధరణితో ఎన్నో చిక్కుముడులు వీడినట్లుగా కేసీఆర్ అండ్ కో చెప్పుకోవటం తెలిసిందే. నిజానికి అదే ధరణి.. ఆయన చేతి నుంచి అధికారం చేజారటానికి కారణమన్న మాట బలంగా వినిపించటం తెలిసిందే. ధరణిని తొలి నుంచి వ్యతిరేకించే రేవంత్ సర్కారు.. దాని స్థానంలో కొత్త విధానాన్ని తెర మీదకు తీసుకొస్తామన్న విషయాన్ని ఎన్నికల ముందు నుంచి చెప్పటం తెలిసిందే. ఇదిలా ఉండగా.. ధరణిపై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంచలన వ్యాఖ్యలు చేశారు. దీని ముసుగులో విలువైన ప్రభుత్వ.. ఇనాం.. పడావు.. ఎవాక్కుయి భూములకు సంబంధించి వేలాది ఎకరాలు అన్యాక్రాంతమైనట్లుగా ప్రభుత్వం గుర్తించిందని పేర్కొన్నారు. ధరణి ముసుగులో దాదాపు 15 వేల ఎకరాలు అన్యాక్రాంతమైనట్లుగా ఆరోపించారు. ఇంత భారీగా చేతులు మారిన భూముల విలువ అక్షరాల రూ.1.5 లక్షల కోట్లుగా పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో తన కార్యాలయంలో చిట్ చాట్ చేసిన భట్టి.. ధరణిపై తీవ్ర ఆరోపణలు చేశారు. అన్యాక్రాంతమైన భూములే కాకుండా అసైన్డ్ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటే మళ్లీ ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని కానీ ఇబ్రహీం పట్నం పరిధిలోని 10 వేల ఎకరాల విషయంలో అందుకు భిన్నమైన పరిస్థితి చోటు చేసుకుందన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో 10వేల ఎకరాలను ధారాదత్తం చేసినట్లుగా పేర్కొన్న భట్టి.. 'గతంలో భూముల రిజిస్ట్రేషన్ అనంతరం రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే భూముల మ్యుటేషన్ జరిగేది. పట్టాదార్ పాస్ పుస్తకాలు వచ్చేవి. ధరణి వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ అయినంతనే మ్యుటేషన్ జరగటం.. ధరణి పోర్టల్ లో వేలిముద్రలు.. ఫోటోలు రాగానే అక్కడికక్కడే ఇతరులకు అమ్మేయటం వల్ల అసలు భూముల చరిత్ర తెలియకుండానే అమ్మకాలు.. కొనుగోళ్లు జరిగిపోయాయి" అని పేర్కొన్నారు. ఒకసారి ధరణిలో ఎంట్రీ అయ్యాక వాటిని మార్చే అవకాశం లేకపోయిందని.. కొన్నింటిని కావాలనే పార్టు బిలో చేర్చారని.. దీన్ని అడ్డు పెట్టుకొని పెద్ద ఎత్తున చేతులు మారినట్లుగా పేర్కొన్నారు. ధరణిలో ఒక్క భూ యజమాని పేరు మినహా కాస్తుదారులు.. అనుభవదారుల కాలమ్ లేకపోవటంతో ఇష్టానుసారం భూములు చేతులు మారినట్లుగా పేర్కొన్నారు. ధరణికి ముందున్న రికార్డులను.. ధరణిలోకి వచ్చిన తర్వాత మారిన భూముల వివరాలను పరిశీలిస్తామని పేర్కొన్న భట్టి మరో కీలక అంశాన్ని ప్రస్తావించారు. "పూర్తిస్థాయిలో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయి. భూములు మూడు.. నాలుగు చేతులు మారినా.. ప్రభుత్వానికి చెందిన భూములుగా తేలితే స్వాధీనం చేసుకుంటాం. ప్రధానంగా పార్టు బీ కింద పెట్టిన భూముల్లోనే ఈ దందా పెద్ద ఎత్తున సాగింది" అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి.

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

శుక్రవారం - 20 - డిసెంబర్ - 2024

## అమిత్ షా వ్యాఖ్యలపై భగ్గుమన్న దళిత సంఘాలు

### అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన



అమరచింత వనపర్తి డిసెంబర్ 19 జనం రిపోర్టర్: రాజ్యాంగం పై పార్లమెంటులో జరిగిన చర్చలో హొంమంత్రి అమిత్ షా అంబేద్కర్ ను అవమానించారని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. గురువారం అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దళిత హక్కుల పోరాట సమితి, దళిత సంఘం, మాల మహానాడు నాయకులు మష్పు రవీందర్, భాస్కర్ ,అబ్రహం, రామ్మూర్తి మాట్లాడుతూ లోక్ సభలో అమిత్ షా కాంగ్రెస్ నాయకును ఉద్దేశించి రోజు అంబేద్కర్ జపం చేసే కంటే భగవంతున్ని స్మరిస్తే కొన్ని జన్మల వరకు స్వర్గ ప్రాప్తి వస్తుందని అనడం అంబేద్కర్ ను అవమానించడమే అని అన్నారు. భారతదేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ ను పార్లమెంటులో భగవంతుని కంటే తక్కువ చేసి చూపించడం తగదన్నారు. ప్రతి ఒక్కరూ ఎవరికి తోచిన విధంగా భగవంతుని ప్రార్థించుకోవచ్చని అలాగని ఈ విషయంలో అంబేద్కర్ పేరును ప్రస్తావించడం సరికాదన్నారు. అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్ షా ను మంత్రివర్గం నుండి కాక బిజెపి నుండి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. దేశంలో బడుగు, బలహీన ,వెనుకబడ్డ ముస్లి, మైనారిటీ లకు ప్రతి పౌరునికి రాజ్యాంగ పలాలు అందించిన ఘనత అంబేద్కర్ కు ఉందన్నారు. బిజెపి నాయకులు దేశంలో ఏదో ఒకచోట అంబేద్కర్ పై విషయం కక్కుతూ ఉన్నారని ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. వెంటనే అమిత్ షా తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు లేటు పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎర్రన్న, శ్యాంసుందర్, సౌలు, దినకర్ తో పాటు పలువురు పాల్గొన్నారు

## పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి



కోట్ పల్లి డిసెంబర్ 19(జనం రిపోర్టర్): కోట్ పల్లి పోలీస్ స్టేషన్ కు వచ్చిన వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి కి పోలీస్ అధికార లాంచనలతో దారూర్ సీఐ రఘురాములు కోట్ పల్లి ఎస్సై స్రవంతి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్లోని పలు కేసుల రికార్డులను ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన ప్రతి ఫిర్యాదు దారులతో ఆప్యాయంగా పలకరించి ఫిర్యాదులు తీసుకోవాలన్నారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి న్యాయం చేయాలని ఎస్సై కి సూచించారు. ఈ కార్యక్రమంలో దారూర్ సీఐ రఘురాములు.కోట్ పల్లి ఎస్సై స్రవంతి. ఏ ఎస్సై సత్యనారాయణ. పిఎస్ఐలు తిరుమలేష్. వేణు. హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్. రఘురామయ్య . కానిస్టేబుళ్లు రైటర్ నరేష్. రమేష్ గౌడ్. మహేందర్. తదితరులు ఉన్నారు.

## బలవద్ర వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న దద్దాల



(కనిగిరి డిసెంబర్ 19 జనంరిపోర్టర్ ): చంద్రశేఖరపురం టౌన్ నందు బలవద్ర పెద్దన్న బలబద్ర శాంతమ్మ గార్ల కుమార్తె సమీరా కళ్యాణ మహోత్సవం గురువారం జరిగింది. ఈకార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు భువనగిరి వెంకటయ్య, ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, ఎంపీటీసీ తిరుపతి రెడ్డి,మన్నేపల్లి పెద్దన్న, బత్తుల దేవరాజ్, మాజీ సర్పంచ్ పులిమి ఆదినారాయణ, సర్పంచి స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, బోయ మడుగు సర్పంచి బొట్ల చిరంజీవి,సంగిశెతట్టి వాసు, బోయిన కొండయ్య, తోట రమేష్,సమీరా, సమీర్, ఎలికా, వినోద్, గొబ్బిళ్ళ శీను, నూకముల రాజశేఖర్ రెడ్డి,సంగటి మహేంద్ర, ఇస్రాయిల్,రాయుడు, తదితరులు పాల్గొన్నారు

## నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ టీమ్
## నెల్లిపాక పి.హెచ్.సి సందర్శన



ఎటపాక డిసెంబర్ 19జనం రిపోర్టర్: అల్లూరి సీతారామరాజు జిల్లా, ఎటపాక మండలం, నెల్లిపాక పి.హెచ్.సి ని నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ టీమ్ డాక్టర్ రమేష్ బాబు, ట్రైబల్ ప్రోగ్రాం ఆఫీసర్,కన్సల్టెంట్ రాజ్ కిరణ్ పి.హెచ్.సి లో వసతులను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా నెల్లిపాక పి.హెచ్.సి లోని అన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం నెల్లిపాక జిల్లా ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించి అర్.బి.ఎస్.కె.కార్యక్రమం స్ర్కీనింగ్ ని క్రాస్ చెకింగ్ చేశారు.నెల్లిపాక గ్రామ సందర్శనలో భాగంగా అంటువ్యాధులు మరియు దీర్ఘకాలిక వ్యాదుల నమోదు కార్యక్రమం క్రాస్ చెక్ చేశారు.ఈ కార్యకర్మంలో వైద్యాధికారి డాక్టర్ విష్ణు ప్రియ,పి.హెచ్.ఎన్. అరుంధతి,పి.హెచ్.సి సిబ్బంది,పారామెడికల్ సిబ్బంది ఏ.ఎన్.ఎంలు,హెల్త్ అసిస్టెంట్ లు,ఆశా కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



## జగనన్న జన్మదిన వేడుకలకు విశ్రుత ఏర్పాట్లు చేస్తున్న దద్దాల

### ప్రతి గ్రామ, మండలాల్లో జగనన్న పుట్టినరోజు వేడుకలు జరపాలి

### కార్యకర్తలకు పిలుపునిచ్చిన దద్దాల నారాయణ యాదవ్



(కనిగిరి డిసెంబర్ 19 జనం రిపోర్టర్ ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డ జన్మదిన వేడుకలు ఈనెల 21వ తేదీ జరగనున్నాయి. ఈవేడుకలు కనిగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామ మరియు మండలాల్లో ఘనంగా జరుపుటకు కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ విశ్రుతంగా ఏర్పాట్లు చేశారు. అంతే కాకుండ ప్రతి గ్రామంలో జగనన్న పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరపాలని పార్టీ శ్రేణులకు పిలువునిచ్చారు. ఆరోజు కేక్ కటింగ్, బ్లడ్ డొనేషన్ క్యాంప్,చీరల పంపిణీ, అన్నదాన కార్యక్రమం జరుగుతుందని దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు,జగనన్న అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయవలని ఆయన కోరారు

## అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వాక్యాలను వెనక్కి తెలుసుకోవాలి....



రామగుండం /డిసెంబర్ 19(జనం రిపోర్టర్): డాక్టర్ అంబేద్కర్ పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా దళిత సంఘాలు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖని మున్సిపల్ "టీ" జంక్షన్ వద్ద చేపట్టిన నిరసన ధర్నా లో ఐఎఫ్టీయు రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ. మాట్లాడుతూ... రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోం శాఖ మంత్రి అమీత్ షా చేసిన వాక్యాలను సిపిఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ, ఐఎఫ్టీయు లు తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ దేశంలో బడుగు బలహీన వర్గాల కోసం దళితుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అలాంటి గొప్ప వ్యక్తి పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇలాంటి వాక్యాలు చేయటం దురదృష్టకరమని అన్నారు. తక్షణమే కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమాజానికి క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ ధర్నా లో వామపక్ష పార్టీల నాయకులు, దళిత సంఘాలు, అంబేద్కర్ సంఘాల నాయకులు సిపిఐ(ఎం ఎల్) న్యూ డెమోక్రసీ.ఐఎఫ్టీయు నాయకులు ఈ.నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలి

### పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ ఉండాలి....

### పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్...

రామగుండం /డిసెంబర్ 19(జనం రిపోర్టర్): వార్షిక తనీఖీల్లో భాగంగా రామగుండం సర్కిల్ ఆఫీస్, రామగుండం పోలీస్ స్టేషన్ ను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తనీఖీ చేసారు. తనీఖీ లో భాగంగా రామగుండం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు పోలీస్ అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం చేసారు. అనంతరం



ముందుగా పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పోలీస్ కమిషనర్, డిసిపి , ఎసిపి లతో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును,రికార్డ్స్ పరిశీలించడంతో పాటు వచ్చిన



ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను, గ్రేవ్ కేసెస్ లలో ఉన్న సిడి ఫైళ్లను పరిశీలించారు. నిందితుల అరెస్ట్, రౌడీ షీటర్ల వివరాలు, కోర్ట్ లో పెండింగ్ లో వున్న కేసులు, వాటికి సంబందించిన దర్యాప్తు వివరాలను, రోడ్డు ప్రమాదాల నివారణకు ,నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు పోలీస్ కమిషనర్ సబ్ ఇన్స్ స్పెక్టరు ను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీంచారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...పోలీస్ స్టేషన్ కు వచ్చే వారితో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, సమస్యతో పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలన్నారు. నేరాల కట్టడి కొసం అధికారులు మరింత శ్రమించడంతో పాటు, నేరం జరిగిన వెంటనే స్టేషన్ అధికారులు వేగంగా స్పందించాలని, చట్టాలను అతిక్రమించే చర్యలకు పాల్పడే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్ పరిధిలోని జరిగే ప్రతి విషయం ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు, ముందస్తు సమాచార సేకరణ అవసరమని, బ్లూ క్లోట్స్ సిబ్బంది డయాల్ 100 కాల్స్ కి వెంటనే స్పందించి,వారు సంఘటన స్థలంకి త్వరగా చేరుకోవాలని సూచించారు. వారి తో అక్కడ పరిస్థితి కంట్రోల్ కానప్పుడు వెంటనే ఎస్ఐ కి, సిబ్బందికి సమాచారం అందించి వెంటనే పిలిపించుకోవాలన్నారు. బ్లూ క్లోట్స్, పెట్రో కార్ సిబ్బంది విసబుల్



పోలిసింగ్ నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు, పిర్యాదులు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని, గంజాయి,మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, అక్రమ రవాణా, సేవించడం వంటి వాటిపై, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో పెద్దపల్లి డిసిపి చేతన, గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్, రామగుండం సి ఐ ప్రవీణ్ కుమార్ ,రామగుండం ఎస్ఐ సంధ్యారాణి ,ఎన్టిపిసి ఎస్ ఉదయ్ కిరణ్ ,అంతర్గం ఎస్ ఐ వెంకట్ ఉన్నారు.

# 33వ. డివిజన్ అభివృద్ధి కై నిర్లక్ష్యమా.. లేక వివక్షనా...?



రామగుండం /డిసెంబర్ 19(జనం రిపోర్టర్): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 33వ. డివిజన్ లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ, తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ మద్దెల దినేష్ ఇంచార్జీ కమీషనర్ కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం ఇంచార్జీ కమీషనర్ కు వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రామగుండం నగర పాలక సంస్థలోని 33వ. డివిజన్ పూర్తిగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండి ఎక్కడ చూసినా సమస్యలు పుట్టగొడుగుల్లాగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా డివిజన్ లో రోడ్లు పూర్తిగా చెడిపోయి అస్తవ్యస్తంగా తయారయ్యాయని, అసలు రామగుండం నగరపాలక సంస్థలోని 50 డివిజన్ల లో 33వ. డివిజన్ ఉందా లేదా అనే అనుమానాలు ఉన్నాయని ఆయన అన్నారు. స్థానిక కార్పొరేటర్, నగర పాలక సంస్థ అధికారులు ప్రజా సమస్యలు పట్టించుకోరని, వారు డివిజన్ సమస్యలు ఏనాడు పట్టించుకోరని, కేవలం స్వార్ధపూరిత పనులు చేసుకోవడానికే ఉన్నారని ఆయన ఆరోపించారు. అసలు 33వ. డివిజన్ అభివృద్ధి చేయటమంటే ఎందుకు అంత నిర్లక్ష్యమా..? లేక వివక్షనా..? అని అర్థం కాని పరిస్థితి ఉందని కమీషనర్ కు ఇచ్చిన వినతి పత్రం లో పేర్కొన్నారు. అదే విధంగా డివిజన్ లో మరో గల్లీలో డ్రైనేజ్ కోసం అని త్రవ్వి మంచిగా ఉన్న రోడ్డును పూర్తిగా చెడగొట్టి ఇప్పటికీ రోడ్డు వేయకుండా, స్థానిక ప్రజలు వర్షాకాలం వస్తే చెప్పుకోలేని ఇబ్బందులు పడుతున్నారని ఇండ్లలోకి నీళ్లు వస్తున్నాయని కనుక 14-2-238 నుండి 14-2-196 వరకు కేవలం మూడు ఫీట్ల నుండి ఐదు ఫీట్ల వెడల్పు రెండు వందల మీటర్ల వరకు నూతన రోడ్డు నిర్మించాలని ఆయన కమీషనర్ ను కోరారు. సింగరేణి కమ్యూనిటీ హాల్ ముందు గల ఖాళీ స్థలం ప్రజల సౌకర్యార్థం కొరకు పార్కును నిర్మించి, అందులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయించాలని, అదేవిధంగా పరశురాంనగర్ నుండి ఫైవింక్లైన్ వెళ్లే రహదారి వెంట స్ట్రీట్ లైట్స్ ఉన్నప్పటికీ వాటికి అడ్డుగా -పెద్ద పెద్ద చెట్లు ఉండడంతో వెల్తురు రాకపోవడంతో రహదారి వెంట వెళ్లే వాహనదారులకు చీకటితో ప్రమాదాలు జరుగుతున్నాయని, నగరపాలక సంస్థ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ కు తెలియజేస్తే మాకు సంబంధం లేదని చెబుతూ, సింగరేణి యాజమాన్యం చేస్తుందని ఉచిత సలహాలు ఇస్తూ, నిర్లక్ష్య సమాధానాలు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. 5-ఇంక్లైన్ సమీపంలోని మజీద్ కాంప్లెక్స్ సమీపంలోని పోచమ్మ గుడి ప్రక్కన శిధిలావస్థకు చేరిన కల్వర్టును త్వరితగతిన పునర్నిర్మాణం పనులు ప్రారంభించాలని ఆయన కోరారు.

## విజ్ఞాన్స్ యూనివర్సిటీను సందర్శించిన 14 మంది మడగాస్కర్ దేశ ప్రతినిధులు

పొన్నూరు డిసెంబర్ 19. జనం రిపోర్టర్: భారత్ - మడగాస్కర్ దేశాల మధ్య అకడమిక్, పరిశోధనలు, అగ్రికల్చర్ రంగం విభాగంలో టెక్నాలజీతోపాటు పరస్పర అవగాహన, దౌత్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని మడగాస్కర్‌లోని మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పెడగాజి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జ్ రావోనిహెరిజఓనా ఆంద్రియామియాకట్సిలావో అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్, అకడమీ ఫర్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో "కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్" అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్‌ను గురువారం ఘనంగా ముగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మడగాస్కర్‌లోని మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పెడగాజి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జ్ రావోనిహెరిజఓనా ఆంద్రియామియాకట్సిలావో మాట్లాడుతూ తమ దేశంలో విద్యా అవకాశాలను మెరుగుపరచడం, సాంస్కృతిక మార్పిడిను సులభం చేయడం, మడగాస్కర్ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అంతేకాకుండా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో గణనీయమైన మైలురాయిని చేరుకోవచ్చన్నారు. అంతేకాకుండా విజ్ఞాన్ ప్రొఫెసర్లు మడగాస్కర్‌కు వచ్చి బోధనా నిపుణులకు ప్రత్యేక శిక్షణ అందిస్తారని పేర్కొన్నారు. ఈ ప్రయత్నం, మడగాస్కర్‌లోని బోధనా నైపుణ్యాలు మరియు సాంకేతిక నైపుణ్యాలతో విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి దోహదం చేస్తుందన్నారు. ఈ భాగస్వామ్యం అనేక మార్పిడి ప్రోగ్రామ్లకు సన్నాహకంగా ఉంటుందని, ప్రోగ్రామ్లు రెండు దేశాల మధ్య విద్యార్థులు, అధ్యాపకులు, జ్ఞాన మార్పిడి నిర్వహించడాన్ని సులభతరం చేస్తాయన్నారు. తద్వారా విద్య, పరిశోధన మరియు సాంస్కృతిక మార్పిడి రంగాల్లో పరస్పర అభివృద్ధి మరియు అవగాహన పెరుగుతుందన్నారు. యూనివర్సిటీలో ఉన్న మడగాస్కర్ విద్యార్థులతో



ప్రత్యేకంగా సమావేశమై వారికి అందిస్తున్న వసతులపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ మడగాస్కర్ ప్రభుత్వానికి తమ యూనివర్సిటీ, పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు సమర్థమైన కరిక్యులం సృష్టించడంలో సహాయం, బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడం, ఆధునిక ఆన్‌లైన్ బోధనా విధానాలు, వినూత్న ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను అనుసరించడం, మడగాస్కర్ విద్యార్థుల కోసం సులభమైన ప్రవేశాల ప్రక్రియ, నిపుణుల మార్గదర్శకం, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాసంస్థలను ఏర్పాటుచేసే దిశగా మార్గదర్శకం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని మడగాస్కర్ ప్రతినిధులకు సూచించారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి నాణ్యమైన విద్య అనేది కీలకమైనదని చెప్పారు. ముఖ్యంగా నాణ్యమైన విద్య అందరికీ సులభంగా అందించడం, సుస్థిర అభివృద్ధి లక్ష్యం, సాధారణ అధ్యయనం కాకుండా అనుభవాత్మక, ప్రశ్నోత్తర విద్య, అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను విద్యార్థులకు అందించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. విద్య, పరిశోధనలతో పాటు సాంస్కృతిక మార్పిడి, అగ్రికల్చర్ టెక్నాలజీ, పరస్పర సహకార అవకాశాల అన్వేషణ వంటి అంశాల గురించి చర్చించారు. ఉమ్మడిగా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఇరువురి మధ్య భాగస్వామ్యం పటిష్టమవ్వడంతో పాటు విద్యాపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. దీని ద్వారా విద్యార్థులకు, అధ్యాపక సిబ్బందికి అపారమైన ప్రయోజనాలు చేకూరుతాయని వెల్లడించారు. మడగాస్కర్ ప్రతినిధులు పర్యటనలో భాగంగా వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ దత్త గ్రామాలైన వేజెండ్ల, సంగం జాగర్లమూడి ప్రభుత్వ పాఠశాలలు, గుంటూరులోని ఎల్ఐసి కాలనీ విజ్ఞాన్ హై స్కూల్, విజ్ఞాన్ నిరుల ఇంజనీరింగ్ కాలేజ్, విజ్ఞాన్ డిగ్రీ కాలేజ్, జూనియర్ కాలేజీలను సందర్శించారు. అనంతరం ముఖ్య అతిథులను విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మడగాస్కర్‌లని మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ సెకండరీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రాంద్రియానరివో హసినైనా రిచర్డ్, మాస్ అండ్ సివిక్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఫియాంగో మానపోక్ జుడిత్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# సెమీ క్రిస్మస్ వేడుకలు

### 600 మంది పేదలకు దుప్పట్లు పంపిణి

### సుధీర్ బాబు సేవలను అభినందించిన కనిగిరి సిఐ ఎస్.కె ఖాజావలి




(కనిగిరి డిసెంబర్ 19 జనం రిపోర్టర్ ): మానవసేవే మాధవసేవ అనే లక్ష్యంతో కనిగిరి చుట్టూ ప్రక్కన గ్రామాల్లోని, కనిగిరి పట్టణంలోని నిరాశ్రయులుకు నిరుపేదలుకు వితంతువులుకు ఆపదలో ఉన్నవారికి తన వంతు ఎప్పుడు సహాయ సహకారాలు అందిస్తూ నిస్వార్ధ సేవ చేస్తున్న స్నేహస్తం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డి సుధీర్ బాబు యొక్క సేవలో అభినందనీయమని కనిగిరి పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.కె ఖాజావలి పేర్కొన్నారు. గురువారం కనిగిరి స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సుధీర్ బాబు తల్లిదండ్రులైన కీర్తిశేషులు డి మోహన్ రావు వారి సతీమణి కృపమ్మ గార్ల జ్ఞాపకార్ధం మరియు సెమీ క్రిస్మస్ పురస్కరించుకొని స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డి సుదీర్ బాబు అధ్యక్షతన కనిగిరి మండలంలోని గ్రామాల్లోని వితంతువులకు, వృద్ధులకు నా అనే వారిని కోల్పోయిన నిరాశ్రయులకు వారికి చలికాలం ఉపయోగపడే విధంగా 600 మందికి రగ్గులు, అల్పాహారం పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐ మాట్లాడుతూ మాట్లాడుతూ సమాజంలోని నిరుపేద వర్గాలకు వారి ఆకలి తీర్చడంలో వారి అవసరాలు తీర్చడంలో సుధీర్ బాబు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎటువంటి లాభాపేక్ష లేకుండా తన తన కష్టపడిన దాంట్లో తనకు వచ్చినటువంటి సంపాదనలో కొంత పేదలకు సహాయం చేయుట ఖర్చు చేయడం నిజంగా అభినందనీయమని కొనియాడారు.దళిత హక్కుల వేదిక వికలాంగుల హక్కుల వేదిక అధ్యక్షులు మల్లికార్జున్, దానయ్య, తాతపూడి శ్యామ్ మాట్లాడుతూ సుధీర్ బాబు సేవలు ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోర?

## జగనన్న జన్మదిన వేడుకలు జయప్రదం చెయ్యండి

### మండల పార్టీ అధ్యక్షులు యక్కంటి శ్రీనివాసరెడ్డి



(హనుమంతునిపాడు డిసెంబర్ 19 జనం రిపోర్టర్ ): ఈనెల 21అనగా శనివారం హనుమంతునిపాడు మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైయస్ జగన్ మెహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగానిర్వహించడం జరుగుతుందని హనుమంతునిపాడు వైసీపీ పార్టీ అధ్యక్షులు మాజీ సింగిల్ విండోఅధ్యక్షులు యక్కంటి శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆరోజు కేక్ కటింగ్ జరుగుతుందని ఈ కార్యక్రమానికి మండల నాయకులు ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, అనుబంధ సమస్త అధ్యక్షులు,కార్యకర్తలు జగనన్న అభిమానులు విరివిగా కేక్ కటింగ్ ప్రోగ్రాంలొ పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు

## వెల్గటూర్ మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



వెల్గటూర్ డిసెంబర్19 జనం రిపోర్టర్: వెల్గటూర్ మండల కేంద్రంలో సీఎంఆర్ ఫ్ చెక్కుల పంపిణీ గురువారం నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటిపర్తి శైలెందర్ రెడ్డి ఆధ్వర్యంలో 56 మంది లబ్దిదారులకు రూ.18లక్షల 18 వేల విలువ గల చెక్కులను పంపిణి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మెరుగు మురళి గౌడ్, మాజీ ఉప సర్పంచ్ గుండాటి సందీప్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా జెనరల్ సెక్రటరీ గంద్ర శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుదారి రమేష్, బండెల ఉదయ్ గౌడ్, సోషల్ మీడియా ఇంచార్జి గుమ్ముల వెంకటేష్, %ూవీజ% డైరెక్టర్లు జూపాక ప్రవీణ్, బిసగోని హరీష్, నల్ల తిరుపతి, మన్నే జితేందర్, శ్రవణ్ రెడ్డి, రేగుంట నర్సయ్య, పాక రవీందర్, గాజుల విజయ్, గెల్లు శ్రీనివాస్, రత్నాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా విద్యాధికారి ఆకస్మిక తనిఖీ



వెల్గటూర్. జగిత్యాల జిల్లా డిసెంబర్ 19 జనం రిపోర్టర్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుల్లకోట ను జగిత్యాల జిల్లా విద్యాధికారి శ్రీ కె రాము గారు ఆకస్మికంగా సందర్శించారు. 10వ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల్ని పరిశీలించి ప్రగతిని విశ్లేషించారు. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు పదవ తరగతి విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని పలు సూచనలు అందించారు. విద్యార్థులకు చక్కగా చదివి 10 జీపీఏ సాధించాలని సూచించారు. వీరి వెంట మండల విద్యాధికారి మరియు ప్రధానోపాధ్యాయులు జి. రామచంద్రం, మరియు సెక్టోరియల్ అధికారి రాజేష్, ఉపాధ్యాయులు మునీందర్ శనిగరపు రవి శ్రీనివాస్ రెడ్డి శ్రీనివాస్ రాజ్యలక్ష్మి ప్రసన్న దీపిక రమేష్ సరస్వతి జ్యోతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని విడనాడి కోల్ ఇండియా వేతనాలు చెల్లించాలి.....

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులందరికీ 5000 బోనస్ చెల్లించాలి.....



ఈసంపెల్లి రాజేందర్ ఐఎఫ్టియు..

రామగుండం /డిసెంబర్ **19(జనం రిపోర్టర్):** సింగరేణిలో పనిచేస్తున్న 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులందరికి 5000 వేల రూపాయల బోనస్సు వెంటనే చెల్లించాలని, కోరిండియాలో అమలు జరుగుతున్న హై పవర్ కమిటీ వేతనాలు 2013 జనవరి నుండి అమలు చేయాల్సి ఉండగా, అమలు చేయటానికి నిరాకరిస్తున్న యాజమాన్య వైఖరిని మార్చుకొని హై పవర్ వేతనాలు అమలు చేయాలని, లేదా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమానవేతనాలు చెల్లించాలని కోరుతూ, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు ఆధ్వర్యంలో.. గురువారం హైదరాబాదులో శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, కనీస వేతనాలు కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్, కమిషనర్ ఆఫ్ లేబర్ కు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్ సీనియర్ గౌరవ అధ్యక్షులు జే.సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ ఎం.డి రాసుద్దీన్, ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.అనురాధ, ఎం.శ్రీనివాసు లతోపాటు కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ వివిధ ఏరియాలకు చెందిన ఈసంపెల్లి రాజేందర్, మేకల రామన్న, కొండపల్లి శ్రీనివాస్, మంగిలాల్,వాసు,చారి ప్రతినిధి వర్గంలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎం .శ్రీనివాస్, అనురాధ,సీతారామయ్య, రాసుద్దీన్ లు మాట్లాడుతూ..



25 ఏళ్లుగా సింగరేణి సాధిస్తున్న లాభాలకు 40 వేల మంది గని కార్మికులతో పాటు, 30 వేల మంది కాంట్రాక్టు కార్మికుల కష్టం ఉందన్నారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు ఎంతో కీలకంగా ఉన్నారని వారు తెలిపారు. సింగరేణికి ముఖ్య భూమిక పోషిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పై యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తున్నదని, సుప్రీంకోర్టు తీర్పును జేబీసీసీ ఒప్పందాలను ఖాతర్ చేయకుండా, కార్మికులకు తీరని నష్టం చేస్తున్నందున వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని వారి డిమాండ్ చేశారు.

## జిల్లా స్థాయి పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు పతకాలు అందజేత




ఎటపాక డిసెంబర్ 19జనం రిపోర్టర్: సీఎం కప్ 2024 లో భాగంగా ఈనెల 16వ తేదీన భద్రాచలం సిటీ స్టైల్ సెంటర్లో నిర్వహించిన జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో గెలుపొందిన భద్రాద్రి జిల్లా క్రీడాకారులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ పరంధ రామిరెడ్డి గురువారం రామచంద్ర డిగ్రీ కళాశాల మైదానంలో ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థాయి క్రీడాకారులకు పతకాలు అందజేశారు.ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు స్పోర్ట్స్ ఆఫీసర్ పరంధ రామిరెడ్డి ప్రత్యేకించి అభినందనలు తెలిపారు. ఈ జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 27 నుంచి జనవరి 2 వరకు హైదరాబాదులో నిర్వహించే సీఎం కప్ 2024 లో స్టేట్ పవర్ లిఫ్టింగ్ లో పాల్గొనడానికి ఎంపిక కాబడతారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ పరంధ రామిరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జివి రామిరెడ్డి,జిల్లా కోశాధికారి మహంతి వెంకటకృష్ణాజి ( సీనియర్ నేషనల్ పవర్ లిఫ్టర్),సీనియర్ అసిస్టెంట్ తిరుమలరావు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## బసంత్ నగర్ ఇండియా మిషన్ పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు

తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలకుఎంపిక...



రామగుండం **/డిసెంబర్ 19(జనం రిపోర్టర్):** బసంత్ నగర్ లోని ఇండియా మిషన్ పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు సీఎం కప్ బేస్బాల్ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు క్రీడా కోచ్ ఎం.కృష్ణ గౌడ్ తెలిపారు వీరు ఈనెల 19వ. తేదీ నుంచి 22వ. తేదీ వరకు హైదరాబాదులోని గచ్చిబౌలి క్రీడామైదానంలో జరిగే సీఎం కప్ పోటీల్లో ఆడుతున్నారు. వీరిలో పేసరి అక్షిత్, కే.సాయి ప్రణవ్, బి. అక్షయ్, ఇ.శరత్, ఎం. అంజన్ సాయి గౌడ్, సజ్జన్ యాదవ్, పి.సాత్విక్, డి.నిక్షయ్, నాని. అంబేద్కర్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మహేంద్రన్, కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యం, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వీరిని అభినందించారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యం చికెన్ నూనె సరుకులు అందచేసిన మాజీ సర్పంచ్



కన్నాయిగూడెం **/డిసెంబర్ 19(జనం రిపోర్టర్):** కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో బీజేపీ కార్యకర్త జనగాం సత్యం అనారోగ్యం కారణం గా గత వారం క్రితం మృతి చెందడం జరిగింది మృతి నీ కుటుంబాన్ని బీజేపీ శక్తి కేంద్రాల ఇంచార్జి పానుగంటి రాం మూర్తి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ దుర్గం సమ్మక్క పారామర్శించి 50 కేజీల బియ్యం చికెన్ మంచి నూనె సరుకులు అందచేయ్యడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ బీజేపీ పార్టీ మృతి చెందిన జనగాం సత్యం కుటుంబానికి ఎప్పుడు అండగా ఉంటదని మాజీ సర్పంచ్ బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం సమ్మక్క అన్నారు ఈ కార్యక్రమం లో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కుమ్మరి సత్యం దళిత మోర్చా మండల అధ్యక్షులు సునార్కని లక్ష్మయ్య మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు పానుగంటి సంగీత యువ మోర్చా మండల అధ్యక్షులు జనగాం ఆనంద్ బూత్ అధ్యక్షులు కావేరి సుమన్ కావేరి నాగేశ్వరవు ప్రధాన కార్యదర్శి కావేరి ఆనంద్

## పార్లమెంట్ సభ్యులపై దాడి చేసిన రాహుల్ బాబాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

డా జాడి రామరాజు నేత



హన్మకొండ **/డిసెంబర్ 19(జనం రిపోర్టర్):** హన్మకొండ జిల్లా కేంద్రం లో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డా జాడి రామరాజు నేత మాట్లాడుతూ విదేశీ కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షురాలు సోనియా బేగం కుమారుడు పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ బాబా తోటి పార్లమెంట్ సభ్యులపై దాడి చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు అదేవిదంగా డా బి ఆర్ అంబేద్కర్ ను నాటి ప్రధాన మంత్రి రాహుల్ బాబాముత్తాత జహార్ లాల్ నెహ్రు రెండు సార్లు ఓడించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ నాయకులాదే అన్నారు అదేవిదంగా భరత్ దేశంతొలి న్యాయ శాఖ మంత్రి గా నిండు పార్లమెంట్ లో మహిళా బిల్లు ప్రవేశ పెడితే మహిళ బిల్లు ను వ్యతిరేకించి అవమానపరచిన కాంగ్రెస్ నాయకులకు రాజ్యాంగం నిర్మాత డా బాబా సాహెబ్ అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీ నాయకులకే లేదని అన్నారు ఇప్పటికైనా ప్రజలు మేధావులు పత్రిక మిత్రులు ఆదివాసీ దళిత బహుజన మైనార్టీ ప్రజలు ఆలోచించండి కేంద్రం లో బీజేపీ అధికారం లోకి వచ్చిన తరువాత మాత్రమే డా బి ఆర్ అంబేద్కర్ ను భారతరత్న ఇచ్చి గౌరవించింది నరేంద్ర మోడీ ప్రభుత్వం అని అన్నారు కాంగ్రెస్ పార్టీ నీ దేశం లో ప్రజలు కూకట వేళ్ళతో పీకేస్తున్నారు కాబట్టే రాహుల్ బాబాదేశప్రజల ను రెచ్చ గొట్టి లబ్ది పొందాలనే ఆలోచన తో నాడు అవమానించిన కాంగ్రెస్ పార్టీ నేడు అంబేద్కర్ ను అడ్డ పెట్టు కొని ఆదివాసీ దళిత బహుజన వర్గాల ప్రజలను రెచ్చగొట్టి లబ్ది పొందాలని చూస్తున్నారని ప్రజలు మేధావులు గమనించలని బీజేపీ దళితమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డా జాడి రామరాజు నేత అన్నారు

## వికారాబాద్ జిల్లా మున్సిపల్ పరిధిలో గల తెలంగాణ ఎస్సీ సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలు 1, 2, బిసి వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు..!!



వికారాబాజిల్లా ప్రతినిధి డిసెంబర్ 19 (జనం రిపోర్టర్): గురువారము వసతి గృహాలను ఆకస్మిక తనిఖి చేసి మాట్లాడుతూ హాస్టల్స్ లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విదంగా పర్యవేక్షణ చేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు. వంటగది లో గల బియ్యం, పప్పులను, కూరగాయలు, పరిసరాలను పరిశీలించారు. ప్రతి రోజు కొత్త మెనూ ప్రకారం వండాలన్నారు, ప్రతి రోజు టిఫిన్, భోజనం ఎలా పెడుతున్నారని విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార విషయంలో శుచి, శుభ్రత పాటించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాత్ రూమ్ లు. టై లెట్స్ ను పరిశీలించి ,పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పర్యవేక్షణ చేయాలనీ సంబంధిత అధికారులను ఆదేశించారు. చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వసతి గృహాలలో ఫ్యాన్ లు, లైట్స్ , మేజర్ ,మైనర్ రిపేర్ పనులు ఎంత వరకు పూర్తి చేసారని వార్డేన్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని పనులు పూర్తి చేసి రిపేర్ కు ముందు పొటోలు, తర్వాత పోటోలు పంపించాలని తెలిపారు. విద్యార్థులు చదువుతున్న క్లాస్ రూమ్ కి వెళ్లి చదువుతున్న తీరును పరిశీలించారు. 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు అందరు బాగా చదివి పరీక్షల్లో ఉతీర్ణత సాదించాలన్నారు. ఈ తనిఖి కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృధి అధికారి మల్లేశం, సుక్రవర్ధన్ రెడ్డి వార్డెన్లు రత్నం, రవీందర్, తదితరులు ఉన్నారు.



## సప్తగిరి కాలనీ లో ఎన్ డి ఆర్ ఎఫ్ ఆద్వర్యంలో ఎదురయ్యే విపత్తు ప్రమాదాల వలన దళం ప్రతినిధులుచే అవగాహన.....




రామగుండం/డిసెంబర్ **19(జనం రిపోర్టర్):** ఆకస్మికంగా ఎదురయ్యే ఉపద్రవాల నుండి బయటపడడంపై జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ( ఎన్ డి ఆర్ ఎఫ్ ) ఆధ్వర్యంలో.. సప్తగిరి కాలనీ లో గురువారం స్థానికులకు అవగాహన కల్పించారు . ప్రమాదవశాత్తు నీళ్ళల్లో జారి పడడం , పిడుగులు పడడం , వరదలు రావడం వంటి విపత్తులు ఎదురయినప్పుడు బాధితులు , చుట్టు ప్రక్కల వారు ప్రతిస్పందించాల్సిన తీరుపై జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ప్రతినిధులు అవగాహన కల్పించారు. అలాగే గ్యాస్ సిలిండర్ మంటలు, కరెంట్ షాక్ వంటి ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుండె పోటు వచ్చినప్పుడు సి పి ఆర్ చేయడం గురించి కూడా ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు . ఎన్ డి ఆర్ ఎఫ్ పదవ బెటాలియన్ ( విజయవాడ ) కమాండర్ ఐ ఎన్ ఎస్ పి బబ్లు బిశ్వాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో రామగుండం మండల తహశీల్దార్ కుమార స్వామి , నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీధర్ ప్రసాద్ , ఫైర్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణ మండల విద్యాధికారి చంద్రయ్య , ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్ , సానిటరీ ఇన్స్పెక్టర్ లు , సానిటరీ సూపర్ వైజర్లు , నగర పాలక సంస్థ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు. కాగా ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం గతంలో వరద ముంపు కు గురయిన లోతట్టు ప్రాంతాలతో పాటుగా గోదావరి నదీ తీరాన్ని సందర్శించింది. లోతట్టు ప్రాంతాల్లో వరద నివారణ అలాగే సహాయక చర్యలు చేపట్టడంపై ఎన్ డి ఆర్ ఎఫ్ ప్రతినిధులు అధికారులకు అవగాహన కల్పించారు.




## విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి...



రామగుండం/డిసెంబర్ **19(జనం రిపోర్టర్):** విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ఐసిఐ గోదావరిఖని శాఖ ఇంపాక్ట్ ట్రైనర్స్ రమేష్ అబ్బా, దేవి లక్ష్మీనర్సయ్య, మేజిక్ రాజా విద్యార్థులకు సూచించారు. స్థానిక మార్కండేయ కాలనీలోని రెయిన్ బో స్కూల్లో గురువారం నిర్వహించిన, మోటివేషన్ శిక్షణా తరగతులకు హాజరై పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. స్మార్ట్ గోల్ సెట్టింగ్, టైం మేనేజ్మెంట్, ఇన్నర్ పవర్ ఎక్స్ప్లోర్, మెమరీ పవర్ తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. రానున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని, ఉన్న రోజులలో పకడ్బందీ ప్రణాళికతో చదువుతూ, ఉన్నత ఫలితాలను సాధించాలని సూచించారు. ఫలితం మారాలంటే ముందుగా వైఖరి మారాలని, ఫలితానికి తగ్గట్టుగా ప్రణాళికలను ఏర్పాటు చేసుకొని, కృషి చేయాలని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పిఎస్ అమరేందర్ మాట్లాడుతూ... తమ విద్యార్థులకు పరీక్షల ప్రణాళిక-ఉత్తమ ఫలితాల సాధన అంశంపై స్వచ్ఛందంగా శిక్షణనిచ్చిన రాజా, రమేష్, లక్ష్మీనర్సయ్యను అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ఏవో వెంకట ఆదిత్య, ఇంచార్జ్ వేణుమాధవ్, రామిల్ల సర్వేశ్ పాల్గొన్నారు.



## ఉమ్మడి మండలాల్లో మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్ట్




అమరచింత /ఆత్మకూర్/ వనపర్తి డిసెంబర్ 19 జనం రిపోర్టర్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర మాల మహానాడు ఇచ్చిన పిలుపుమేరకు గురువారం అమరచింత, ఆత్మకూర్ మండలాల నుండి అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న పలువురు మాలమహానాడు నాయకులను సురేష్ నరేందర్ ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు, అమరచింత మాల మహానాడు అధ్యక్షులు ఏ రఘు వి ద విష్ణువర్ధన్ అలగనూరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మాలలకు భయపడి ప్రభుత్వం తమను ముందస్తుగా అరెస్టు చేసిందని ఆరోపించారు. ఎన్ని నిర్బంధాలైన ఎదుర్కొని అసెంబ్లీ ముట్టడి చేసి తీరుతామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో సభ్యులు వి రామ్మూర్తి బాలరాజు కుమారస్వామి పురేందర్ రాము విష్ణు శ్యామ్ ఎర్ర శీను వెంకటేష్ ప్రశాంత్ సతీష్ ఆనంద్ కురుమూర్తి రవీందర్ వేణు ఉన్నారు.



## ఎన్ని అరెస్టులు చేసిన మా ఏబిసిడి వర్గీకరణను అడ్డుకోలేరు....

**మాల మహానాడు అంతర్గా మండల యూత్ అధ్యక్షులు కందుగుల కుమార్....**




రామగుండం/డిసెంబర్ **19(జనం రిపోర్టర్):** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కేంద్రంలోని మాల మహానాడు నాయకులను ఏబిసిడి వర్గీకరణను నిరసిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా మాలలు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా, రాత్రికి రాత్రే అంతర్గాం పోలీస్ శాఖ,అంతర్గాం మండల మాల మహానాడు నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం జరిగిందని, అంతర్గాం మండల మాలమహానాడు యూత్ అధ్యక్షులు కందుగుల కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కందుల కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మాల మహానాడు ఏబిసిడి వర్గీకరణను నిరసిస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని మొదలుపెట్టడం జరిగింది.దానిలో భాగంగానే అసెంబ్లీ ముట్టడికి వెళతారని ఉద్దేశంతో,అంతర్గాం మండల మాల మహానాడు ముఖ్య నాయకులను అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా, ముందస్తుగా అరెస్టు చేయడం మా కార్యక్రమాన్ని భగ్నం చేయడం సరైనది కాదని ఇలాంటి ఎన్ని అరెస్టులు చేసిన, మేము తలపెట్టిన ఏబిసిడి వర్గీకరణకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఎంతమంది అడ్డుపడిన, కూడా మేము ఏబిసిడి వర్గీకరణ వద్దు దళితుల ఐక్యత అనే నినాదంతో ముందుకువెళ్లడం జరుగుతుందని, మేము ఎన్నడూ కూడా అన్నతమ్ముల్లాగా ఉందామనే ఉద్దేశంతో ఉన్నామె తప్ప,ఇలా అన్న తమ్ముళ్ల మధ్య చిచ్చు పెట్టడానికి కొంతమంది ప్రముఖ నాయకులు వర్గీకరణ కోసం ప్రయత్నాలు చేస్తున్నారని, ఇలాంటి ప్రయత్నాలు ఆపుకోకపోతే వర్గీకరణ ఆగే వరకు కూడా రాష్ట్రవ్యాప్తంగా మరెన్నో నిరసన కార్యక్రమాలు చేపడతామని, ఏబిసిడి వర్గీకరణ వద్దు దళితుల ఐక్యత ముద్దు జై మాల జై జై మాల జై భీమ్ అనే నినాదాలతో ముందుకు వెళ్లడం జరుగుతుందని కందుగుల కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అంతర్గాం మండల యూత్ అధ్యక్షులు కందుగుల కుమార్, రామగుండం నియోజకవర్గ ఇన్చార్జి గాదం శ్రీనివాస్, మండల నాయకులు గాదం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వేల్పుల సాంబయ్య, మాజీ సర్పంచ్ ఆముల శ్రీనివాస్, గోశిక తిరుపతి, తెగుట్ల నవీన్, తదితరులు ఉన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవము



వేటపాలెం డిసెంబర్ 19 (జనం రిపోర్టర్) మండల పరిధిలోని అఖిలాండ బ్రహ్మాండ నాయకుడు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ రాజ్యలక్ష్మి పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానము నందు శ్రీ వెంకటేశ్వర భక్త సమాజం, శ్రీ వెంకటేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో హరిహర పుత్ర అయ్యప్పస్వామి పడిపూజను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి నామస్మరణతో మారు మ్రోగింది. వివిధ గ్రామాల నుండి అయ్యప్ప స్వాములు తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. దేవస్థానం కళ్యాణ మండపం ముందు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరణ చేయగా చూపరులను ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో దప్పు శ్రీను బృందం నిర్వహించిన పాటకచేరి అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తులకు ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా దప్పు శ్రీను బృందం వారు ఈ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేసేందుకు సహకరించిన శ్రీ వెంకటేశ్వర భక్త సమాజం కమిటీ సభ్యులకు, శ్రీ వెంకటేశ్వర యువజన సంఘం వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షులు పొగడదండ వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షులు బాణాల లక్ష్మీనారాయణ, సాయని లక్ష్మీనారాయణ, కార్యదర్శి అందే రవికుమార్, సహ కార్యదర్శులు అందే శ్రీనివాసరావు రంగిశెట్టి సాంబశివరావు, కోశాధికారి పొగడదండ వెంకటరమణ, కమిటీ సభ్యులు పొగడ దండ వెంకటేశ్వర్లు, పల్లకి సత్యనారాయణ, కాయల వెంకట్రావు, గోపు ఏడుకొండలు, పల్లక రామకృష్ణ, యాద సుబ్బయ్య, సాబినేని లలిత బాబు, గంట సీతారామాంజనేయులు, శ్రీ వెంకటేశ్వర యువజన సంఘం వారు అయ్యప్ప మాల ధరించిన భక్తులు, గురు స్వాములు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## రెవెన్యూ సదస్సులను సద్విని చేసుకోవాలి




మొగల్తూరు డిసెంబర్ 19 జనం రిపోర్టర్: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మార్వో కే రాజ కిషోర్ అన్నారు. గురువారం మొగల్తూరు లో 1,2,3,4 సచివాలయాల ల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 80 మంది రైతులు హాజరు కాగా వారి నుండి 20 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ, నీటి సంఘం ఉపాధ్యక్షులు ముక్కు పుల్లయ్య నాయుడు, మండల సర్వేయర్ ధనరాజ్, ఆర్ ఐ నిరంజన్, వీఆర్వోలు దూసనపూడిపూడి సత్యనారాయణ, సుభాషిణి, వెంకటలక్ష్మి లు పాల్గొన్నారు.

## నాగేశ్వర్ రెడ్డి పార్థివ దేహానికి నివాళి అర్పించినదద్దాల




(కనిగిరి డిసెంబర్ 19 జనంరి పోర్టర్ ): చంద్రశేఖరపురంలో గూడపు నాగేశ్వరరెడ్డి పార్థివదేహానికి కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ గురువారం పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు భువనగిరి వెంకటయ్య, ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, బైరెడ్డి తిరుపతి రెడ్డి,మన్నేపల్లి పెద్దన్న, బత్తుల దేవరాజ్, మాజీ సర్పంచ్ పులిమి ఆదినారాయణ, సర్పంచి స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, బోయ మదుగు సర్పంచి బొట్ల చిరంజీవి,సంగిశెట్టి వాసు, బోయిన కొండయ్య, తోట రమేష్,సమీరా, సమీర్, ఎలికా, వినోద్, గొబ్బిళ్ళ శీను, వాకముల రాజశేఖర్ రెడ్డి,సంగటి మహేంద్ర, ఇస్రాయిల్,రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ధనుర్ మాసం సందర్భంగా 5వ పాశురము



రేపల్లె డిసెంబర్ 19 జనం రిపోర్టర్: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్థానిక ఉప్పుడి రోడ్లు వేంచేసిన శ్రీ లక్ష్మీ గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు మాట్లాడుతూ మాయనై మన్ను వడమదురై మైన్దనై త్తూయ పెరునీర్ యమునై త్తుఱైవనై ఆయర్ కులత్తినిల్ తోన్ఱుమ్ మణివిళక్కై త్తాయైక్కుడల్ విళక్కమ్ శెయ్ త తామోదరనై తూయోమాయ్ వన్దు నామ్ తూమలర్ తూవిత్తొళుతు వాయినాల్ పాడిమనత్తినాల్ శిన్దిక్క ప్పోయపిళైయుమ్ పుగుదరువా నిన్ఱనవుమ్ తీయినిల్ తూశాగుమ్ శెప్పేలో రెమ్బాబాయ్ శ్లోకం యొక్క భావం వివరించారు మిక్కిలి ఆశ్చర్యకరమైన గుణములను, చేష్టలను కలవాడు శ్రీకృష్ణుడు. అతడు ఉత్తర మధురకు నిర్వాహకునిగ జన్మించాడు. భగవత్సంబంధము ఎడతెగనట్టి మధురకు ప్రభువు.యమునా నదీతీరమందున్న గొల్ల కులమున జన్మించి, ఆ గొల్లకులాన్ని ప్రకాశింపజేసినవాడు. గొల్లకుల మాణిక్య దీపము తల్లి యశోదా గర్భమును కాంతివంతమొనర్చిన దామోదారుడు. వ్రతకారణముగా శ్రీకృష్ణుని చేరి, మనము ఇతరములైన కోరికలేవీ కోరక, పవిత్రమైన మనస్సులతో స్వామికి పూలనర్పించి, నమస్కరించి, నోరార అతని కల్యాణ గుణములను సంకీర్తన చేసి, ధ్యానించిన -సంచిత పాపములను, ఇక ఆగామి పాపములను తప్పించుకొనవచ్చును. అతని గుణకీర్తనం చేయటం వలన పాపములన్ని అగ్నిలో పడిన దూదివలె భస్మమై పోయేవే! కావున స్వామియొక్క తిరునామములను అనుసందించుడు. భక్తులు తెల్లవారుజామునే దేవాలయానికి వచ్చి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలను సేకరించారు

## పాపుల రక్షణార్థమై యేసుక్రీస్తు మానవ రూపంలో ఈ లోకానికి వచ్చారు

ప్రపంచ సువార్తికులు రెవ గడ్డం వినయ్ కుమార్



(కనిగిరి డిసెంబర్ 19 జనంరి పోర్టర్ ): పాపుల రక్షణార్థమై యేసుక్రీస్తు మానవ రూపంలో ఈ లోకానికి వచ్చారని ప్రపంచ సువార్తికులు రెవరెండ్ గడ్డం వినయ్ కుమార్ కొనియాడారు,గురువారం స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఏర్పాటుచేసిన కనిగిరి అమరావతి గ్రౌండ్స్ లో జరిగిన పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వాక్యోపదేశం చేశారు,ఈ సభకు రెవరెండ్ పాస్టర్ పాలపర్తి యోషియా అధ్యక్షత వహించారు,సి.ఆర్.పి.ఎఫ్.సి.ఐ నేలపాటి రామయ్య వాక్యోపదేశం చేస్తు హృదయ అంతరంగాలను పరిశీలించేవాడు యేసయ్య అని అన్నారు,అనంతరం పాస్టర్ వినయ్ కుమార్,రామయ్య లను పాస్టర్ యేషీయాపాస్టర్,యేసుదాస్ పాస్టర్, నరసింహం పాస్టర్,శాంతి ఆంధ్ర పత్రిక ఎడిటర్ గురిజాల బాబురావు శాల్వాతో సన్మానించారు, క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని దైవ సేవకులకు బట్టలు పంపిణీ చేశారు, అదేవిధంగా వృద్ధులకు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ నాయకులు, కనిగిరి నియోజకవర్గం లోని 6 మండలాల పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాల సంఘం నాయకులు ముందస్తు అక్రమ అరెస్టు




జూలపల్లి, డిసెంబర్ 19, జనం, రిపోర్టర్: తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున అసెంబ్లీ సమావేశాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చిన మాల సంఘం నాయకులు కంకణాల జ్యోతిబసు మాట్లాడుతూ ముందస్తు అక్రమంగా అరెస్టు చేసి జూలపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారని, ఈ అక్రమ అరెస్టుకు భయపడి లేదని, ఈ ఉద్యమాన్ని మరింత రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేయడమే లక్ష్యంగా మాల సంఘం పనిచేస్తుందని సందర్భంగా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం నాయకులు గుడిసెల రవి, సొల్లు శ్యామ్, పాటు కుల మహేష్, పోశం శాతల్లా కాంతయ్య, పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కరించేందుకే రెవిన్యూ సాహసలు




రేపల్లె డిసెంబర్ 19 జనం రిపోర్టర్: రేపల్లె మండలం పిరేట్లంక గ్రామంలో గురువారం తాసిల్దార్ రేపల్లె వారి అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు అనంతరం రైతుల వద్ద నుండి వినతి పత్రాలను సేకరించారు ఈ కార్యక్రమమునకు రేపల్లె తాసిల్దారు మండలస్పెషల్ ఆఫీసర్ మండల లెవెల్ఆఫీసర్స్ మరియు సచివాలయ సిబ్బంది ఆర్ ఐ రాంబాబు హాజరై నారు.

## విద్యుత్ మీటర్ల తనిఖీలు వేగవంతం

7.4 లక్షలు అపరాధ రుసుము




రేపల్లె డిసెంబర్ 19 జనం రిపోర్టర్ : రేపల్లె రూరల్ మండలం లో తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అయిన వి వి చిరంజీవి ఆధ్వర్యంలో ఇంటెన్సివ్ ఇన్స్పెక్షన్స్ జరిగినవి. ఈ ఇన్స్పెక్షన్స్ లో తెనాలి డివిజన్ లో వివిధ మండలాల నుండి 130 మంది స్టాఫ్ పాల్గొని 4846 సర్వీస్ లు తనిఖీ చేయటం జరిగింది. ఈ తనిఖీలలో 196 మంది వినియోగదారులు అధిక లోడు వాడుతున్నట్టు గుర్తించి 7.4 లక్షలు రూపాయలు పెనాల్టీ గా విధించారు. ఇద్దరు వినియోగదారు కరెంటు దొంగతనంగా వాడటాన్ని గుర్తించి వారికీ 40000.00 రూపాయలు పెనాల్టీగా విధించటం జరిగింది. ఈ కార్యక్రమం లో ఇంకా ఎన్ ఎం ప్రసాద్ , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి పీ ఈ, గుంటూరు గారు, కె రాజశేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రూరల్ -1 , బి అశోక్ కుమార్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెనాలి వారు, మరియు ఇతర ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారాణి ఎన్ సురేష్ బాబు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలియజేశారు

## కూటమి ప్రభుత్వానికే ప్రజామద్దతు తెదేపాలో భారీ చేరికలు

ఏపీ ప్రభుత్వ విప్, శాసనసభ్యులు తంగిరాల సౌమ్య



గడచిన ఐదు ఏళ్ళ రాక్షస పాలన, నేడు రాష్ట్రంలో చంద్రన్న చల్లని రామపాలన కొనసాగుతుంది.

జనం రిపోర్టర్,ఎన్టీఆర్ జిల్లా,కంచికచర్ల మండలం, డిసెంబర్ 19: నందిగామ పట్టణం కాకాని నగర్ ఏపీ ప్రభుత్వ విప్, శాసనసభ్యులు తంగిరాల సౌమ్య కార్యాలయం నందు గురువారం నాడు కంచికచర్ల మండలం కీసర గ్రామము నుంచి పరిటాల రాము ఏడీఐడీసీ డైరెక్టర్, గ్రామ సర్పంచ్ పేరం నరసమ్మ పరిటాల దివ్య గ్రామ మాజీ సర్పంచ్, సంగీత భాస్కరరావు గ్రామ మాజీ సర్పంచ్, జవ్వాజి సైదేశ్వరరావు, ఆకుల శ్రీనివాసరావు, చలామలా స్వామి, తక్కెడ వెంకటేశ్వరరావు వారి అనుచరులు 360 కుటుంబాలతో కలిసి తెలుగుదేశం పార్టీలోకి రావడం జరిగినది. వీరిని కూటమినేతలతో కలిసి ఏపీ ప్రభుత్వ విప్,శాసనసభ్యులు తంగిరాల సౌమ్య వారిని పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం కూటమి ప్రభుత్వం ఈ రోజు పార్టీలోకి విచ్చేసిన ప్రతిఒక్కరిని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాము గడచినా ఐదేళ్ళ రాక్షస పాలన నుంచి ఆంధ్రరాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో స్వేచ్ఛ ఊపిరిని పొందారు. సంక్షేమం పేరిట అప్పులు తెచ్చి పప్పుబెల్లాలుగా పంచి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిన సంగతి అందరికి తెలుసు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్డీయే కూటమికి 164 సీట్లను రాష్ట్ర ప్రజానీకం అతిభారీ మెజారిటీతో ఇచ్చి గెలిపించారు. సూపర్ సిక్స్ లో భాగంగా పెన్షన్ పెంపుదల,ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలండర్ల పంపిణి చేసుకొంటూ పోతున్నాము. గత పాలకుల నిర్లక్ష్యంతో రహదారులు అధ్వాన పరిస్థితికి చేరితే ఈ కూటమి ప్రభుత్వంలో వాటిని అభివృద్ధిపరుస్తూ ముందుకు పోతున్నాము. ఆయకట్టు చివరి ఎకరా వరకు నీరు అందించే దిశగా పని చేస్తున్న రైతు పక్షపాతి ప్రభుత్వం ఈ కూటమి ప్రభుత్వం ఇంతటి అభివృద్ధి, సంక్షేమంతో ఆకర్షితులవుతున్న ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పార్టీలోకి రావడం నిజంగా హర్షణీయం ఈ రోజు పార్టీలోకి విచ్చేసిన ప్రతి ఒక్కరిని పేరు పేరునా మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సాధ్యమైనంత వరకు నాణ్యతతో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి...

-రామగుండం నగర మేయర్....



రామగుండం /డిసెంబర్ 19(జనం రిపోర్టర్): నాణ్యతతో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను రామగుండం నగర మేయర్ ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ... టి యు ఎఫ్ ఐ డి సి , పదిహేనవ ఆర్థిక సంఘం , స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నిధులతో టెండర్ పిలిచిన అన్ని పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా పర్యటనకు ముఖ్యమంత్రి విచ్చేసిన క్రమంలో మంజూరు చేసిన రూ 20 కోట్ల రూపాయల నిధులకు సంబందించిన పనులకు అంచనాలు సిద్ధం చేసి, టెండర్లు పిలిచి పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయించాలని అన్నారు. ముఖ్య కూడళ్ల అభివృద్ధి పనులు ,కొత్త సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు పనుల్లో వేగం పెంచాలని అన్నారు. లక్ష్మీ నగర్ , కళ్యాణ్ నగర్ లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఎస్ ఇ శివానంద్ , ఇ ఇ రామన్ , అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు , డి ఇ లు , ఎ ఇ లు , వర్క్ ఇన్స్పెక్టర్ లు పాల్గొన్నారు.

## రాగి సాగు విస్తీర్ణం పెంపు పై అవగాహన సదస్సు కార్యక్రమంలో జేసి అభిషేక్ కుమార్



గుడిబండ డిసెంబర్ 19 జనం రిపోర్టర్: మండల పరిధిలోని మోరుబాగుల్ గ్రామంలో గురువారం రాగి సాగు విస్తీర్ణం పెంపు పైన అవగాహన కార్యక్రమము నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జెసి అభిషేక్ కుమార్ డీఈవో సుబ్బారావు ఏడిఎస్ఆర్ శ్రీకృష్ణ మేనన్ పాల్గొని.జెసి అభిషేక్ కుమార్ మాట్లాడుతూ రాగి సాగు పంటపై రైతులకు పలు సూచనలు సలహాలు రైతులు పండించే పంటకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది రైతులందరూ రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలియజేశారు ముఖ్యంగా రాగి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం వారే సివిల్ సప్లై ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని ఒక క్వింటాకు 4290 రూపాయలు రైతుల నుంచి రాగులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది అని తెలిపారు. పంట మార్పిడి లో భాగంగా రైతులందరూ కూడా రాగి పంటను సాగు చేయవలసిందిగా రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ తహసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి,మండల వ్యవసాయ అధికారి వీరనరేష్,సివిల్ సప్లై డి ఎం,ఏపీ మాస్ ఎన్జీవో సమస్త గోపాల్,జడ్పీఎన్ఎఫ్ డివిజనల్ యాంకర్ రమేష్ ,సర్పంచ్ తిప్పేస్వామి,మరియు సాగునీటి సంఘాల అధ్యక్షులు హనుమంతరాయప్ప వ్యవసాయ శాఖ సిబ్బంది జడ్పీఎన్ఎఫ్ సిబ్బంది మరియు గ్రామ రైతులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

## పొన్నూరు భవిత కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



పొన్నూరు డిసెంబర్ 19. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని భవిత కేంద్రంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు బి. విజయ కుమారి పాల్గొని ముందుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచమంతా క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటాయని తెలిపారు. దేవుడే మనిషిగా భూమిమీద జన్మించటం మనుషులకు గొప్ప వరమని ఆయన జన్మదినాన్ని క్రిస్మస్ వేడుకగా జరుపుకోవాలని ప్రజల సంప్రదాయమని తెలిపారు .ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి విద్యార్థిని విద్యార్థులకు పంచిపెట్టి బహుమతులను ప్రధానం చేశారు. భవిత కేంద్రం సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత కొత్త వెంకట సాంబశివ రావు కుటుంబ సభ్యులకు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ విప్,శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య పరామర్శ...



జనం రిపోర్టర్,ఎన్టీఆర్ జిల్లా, చందర్లపాడు (మం), వెలదికొత్తపాలెం, డిసెంబర్19:నందిగామ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు చందర్లపాడు మండలపార్టీ మాజీ అధ్యక్షులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కొత్త వెంకట సాంబశివరావు పార్థివ దేహాన్ని కూటమి నేతలతో కలసి సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించిన ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ విప్ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య మాట్లాడుతూ సాంబశివరావు లేరనే విషయం పార్టీలో తీరని లోటని ఆయన అనేక పదవులను నిర్వర్తించి పార్టీకి వీర విధేయుడుగా ఎంతో కష్టపడ్డారని గత కొంత కాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడ్డారని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ ఇటువంటి సమయంలో వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం కలగజేయాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## వర్గీకరణ చేస్తే మాలల సత్తా ఏంటో ఈ ప్రభుత్వానికి చూపిస్తాం

మాలల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మాదారి భోజరాజు




అమరచింత (వనపర్తి) డిసెంబర్ 19 జనం రిపోర్టర్: రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేస్తే మాలల సత్తా ఏంటో ఈ ప్రభుత్వానికి చూపిస్తామని వనపర్తి జిల్లా మాలల ఐక్యవేదిక అధ్యక్షులు మాదారి భోజరాజు హెచ్చరించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర మాల మహానాడు ఇచ్చిన పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడికి వనపర్తి జిల్లా మాలల ఐక్యవేదిక నాయకులు తరలి వెళ్లారు. అసెంబ్లీని ముట్టడించే క్రమంలో పోలీసులు అడ్డుకొని వారిని అరెస్టు చేసి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా భోజరాజు మాట్లాడుతూ మాదిగల కు తలకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏబిసిడి వర్గీకరణ చేస్తానని చిలక పలుకులు పలుకుతున్నారని అలాంటి ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. వర్గీకరణ అనేది పార్లమెంటు లో బిల్లు పెట్టాలని అప్పుడే తామ అంగీకరిస్తామన్నారు. సుప్రీంకోర్టు వర్గీకరణ పై తీర్పు ఇవ్వలేదని కేవలం డైరెక్షన్ మాత్రమే ఇచ్చిందని ఇది రాష్ట్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. అసెంబ్లీ ముట్టడి లో పాల్గొన్న, మాలల ఐక్యవేదిక నాయకులు మూలే వెంకటస్వామి, ములే మూర్తి, శరగుండ్ల చిన్న, కురుటి నరేష్ ఉన్నారు.

## నేడు అనంతలో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం

నార్పల /డిసెంబర్ 19(జనం రిపోర్టర్): అగ్రిగోల్డ్ బాధితులు నేడు (శుక్రవారం) జిల్లా కేంద్రమైన అనంతపురంలో సిపిఐ కార్యాలయంలో సమావేశం అవుతున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధి బోనాల నారాయణప్ప తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని అగ్రిగోల్డ్ బాధితులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నాగేశ్వరరావు, తిరుపతిరావు, కార్యదర్శి చంద్రశేఖర రావు హాజరవుతున్నారని తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం కోసం పోరాటం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు బోనాల నారాయణప్ప తెలిపారు.

## ఎంపీ అంబికా జన్మదిన వేడుకలో ఆకుల బాబు



నార్పల /డిసెంబర్ 19(జనం రిపోర్టర్): అనంత పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో నార్పల మండల టిడిపి సీనియర్ నాయకులు ఆకుల ఆంజనేయులు, విజయ్ కుమార్ (బాబు) పాల్గొన్నారు. ఎంపీ అంబికాకు శాలువా కప్పి, పుష్పగుచ్చం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ సాలెహా, ప్రదీప్ ఆచారి, వల్లం పవన్ తదితరులు పాల్గొన్నారు.

## దండమూడి లో తేనె ప్రాసెసింగ్ యూనిట్ సందర్శన



పొన్నూరు డిసెంబర్ 19. జనం రిపోర్టర్: పొన్నూరు మండలం దండమూడి గ్రామంలోని తేనె పరిశ్రమ ప్రాసెసింగ్ యూనిట్ ను ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తో పాటు అధికారులు గురువారం సందర్శించారు. డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి విజయలక్ష్మి,స్టేట్ ఆర్గనైజర్ సుభాష్, నా బర్డ్ డిడిఎం శరత్, కె వి ఐ బి డైరెక్టర్ రషీద్, బ్యాంకు విలేజ్ డైరెక్టర్ కేశవకుమార్, లైహాంద్ డిపిఓ రాంబాబు, ఏపిఎం జోయీ బాబు, ఎల్ హెచ్ సి సి గురు ప్రసాద్ ,సి సి అరుణ పాల్గొని ప్రాసెసింగ్ విధివిధానాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వీఆర్ఏ అనుమానాస్పద మృతి



పొన్నూరు డిసెంబర్ 19. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెం గ్రామం వీఆర్ఏ గా పని చేస్తున్న కారుమూరి ఏబు గురువారం గ్రామంలోని వాటర్ ట్యాంక్ దగ్గర అనుమానస్పద స్థితిలోమృతిచెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు ఇచ్చిన సమాచారంతో చేబ్రోలు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఏబు మృతిపై సహచర సిబ్బంది తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## మీరు పన్నులేస్తే మేమూ వేస్తాం.. భారత్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్ : తమ దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై భారత్ సహా పలు దేశాలు అధిక పన్నులు వేస్తున్నాయని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. తాము కూడా ఆ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై అలాగే ఎక్కువ పన్నులు వసూలు చేస్తామని ఆయన విలేకరులతో అన్నారు. ‘వారు మా మీద పన్నులు వేస్తే అంతే మొత్తంలో మేమూ వారిపై పన్నులు విధిస్తాం. మేము పన్నులు వేస్తే వారూ వేస్తారు. అన్ని సందర్భాలలోనూ వారు మాపై పన్నులు వేస్తున్నారు. మేమేమో వారిపై వేయడం లేదు’ అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు పిటిఐ వార్తా సంస్థ తెలిపింది.చైనాతో వాణిజ్య ఒప్పందంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన భారత్, బ్రెజిల్ దేశాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. కొన్ని అమెరికా వస్తువులపై ఈ రెండు దేశాలతో పాటు మరికొన్ని దేశాలు కూడా అధిక పన్నులు వసూలు చేస్తున్నాయని ట్రంప్ చెప్పారు. అమెరికా వస్తువులపై భారత్ వంద శాతం పన్ను వేస్తే అమెరికా కూడా ప్రతిగా అంతే వసూలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ‘భారత్ మాపై వంద శాతం పన్ను వేస్తే మేము ఏమీ వేయకూడదా? మీకు తెలుసు. వారు మాకు ఓ సైకిల్ పంపితే మేము కూడా సైకిల్ పంపుతాం’ అని అన్నారు.

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపాదకీయం

## చర్చ జరగాలి కానీ, ఇలాగా..?

### (విశ్లేషణ)

పార్లమెంట్ శీతకాల సమావేశాలు ఈ సోమవారంతో ఆఖరి వారం వ్యవధిలోకి ప్రవేశించాయి. దేశంలో చలి పెరుగుతుంటే, సభలో వాతావరణం మాత్రం వేగంగా వేడెక్కుతోంది. మొన్న నవంబర్ 26న 75 వసంతాలు పూర్తి చేసుకున్న భారత రాజ్యాంగం అమలుపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శల పర్వం చూస్తే ఆ భావనే కలుగుతుంది. లోక్‌సభలో గత శుక్ర, శనివారాలు రాజ్యాంగ చర్చ జరిగితే, ఈ సోమ, మంగళవారాలు రాజ్యసభలో అది కొనసాగుతోంది. 'ఒకే దేశం... ఒకే ఎన్నిక' బిల్లుకు కావాల్సిన రాజ్యాంగ సవరణ మాట అటుంచితే, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కాక గాంధీల కుటుంబ శ్రేయానికై కాంగ్రెస్ నిస్సిగ్గుగా రాజ్యాంగాన్ని సవరిస్తూ పోయిందని ఆర్థిక మంత్రి ఆరోపించడం తాజాగా అగ్గి రాజేసింది. అనేక జటిల సమస్యలకు రాజ్యాంగ సవరణలే ఏకైక పరిష్కారం అంటూ నెహ్రూకు సాక్షాత్తూ సర్దార్ పటేలే లేఖ రాశారంటూ రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తిప్పికొట్టాల్సి వచ్చింది. వెరసి, భారత గణతంత్రానికి ఆత్మ లాంటి రాజ్యాంగంపై చర్చ పక్కదోవ పట్టి, పార్టీలు బురదజల్లుకొనే ప్రక్రియగా మారిపోయింది. నిజానికి, స్వాతంత్ర్యానంతరం భారతదేశ భవితవ్యమెలా ఉంటుందన్న దానిపై బోలెడన్ని అనుమానాలు, జోస్యాలు వెలువడినా, మన రాజ్యాంగం పటాపంచలు చేసింది. నిజానికి, నవ యువ గణతంత్ర రాజ్యంగా మనం అనేక ఒడుదొడుకులను ఎదుర్కొన్నాం. వాటన్నిటినీ తట్టుకొని నిలవడంలోనూ విజయవంతమయ్యాం. భారత రాజ్యాంగం కాలపరీక్షకు నిలిచి, దేశానికి మూలస్తంభంగా నిలిచింది. ఇవాళ అనేక దేశాల్లో, చివరకు సోకాల్డ్ ప్రజాస్వామ్యాల్లోనూ అధికార బదలాయింపులో పలు సమస్యలను ఎదుర్కొంటున్నా, భారత్‌లో మాత్రం ప్రజాభీష్టాన్ని ప్రతిఫలించే అధికార బదలీ శాంతియుతంగా సాగిపోవడం మన రాజ్యాంగం వేసిన పటిష్ఠమైన పునాదికీ, చూపిన ఆచరణాత్మకమైన మార్గానికీ తార్కాణం. ఈ ఏడున్నర దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో వేర్వేరు రాజకీయ పార్టీలు, కూటములు దేశాన్ని పాలించాయి. 1975లో ఎమర్జెన్సీ విధింపు లాంటి అశనిపాతాలు అడపాదడపా ఎదురైనా, ప్రభుత్వాలన్నీ దేశాన్ని ముందుకే నడిపాయి. క్రియాశీలక సజీవపత్రంగా రాజ్యాంగ రూపకర్తలు సంభావించిన భారత రాజ్యాంగం అంతర్గత సంకల్పబలం, స్థితిస్థాపక చైతన్యంతో నవ భారత అవసరాలకు తగ్గట్టుగా మార్పులతో నిత్య నూతనంగా నిలుస్తూ వచ్చింది. దానికి తగ్గట్టే రాజ్యాంగాన్ని ఇప్పటికి శతాధిక పర్యాయాలు సవరించడం జరిగింది. దేశ సామాజిక, ఆర్థిక ప్రయోజనాలకు తగ్గట్టు దేశం ముందుకు పోయేందుకు అనేక ఏళ్ళుగా భారత రాజ్యాంగం వీలు కల్పిస్తూనే వచ్చింది. అనేక పార్శ్వాలున్న ఈ రాజ్యాంగ ప్రస్థానాన్ని పార్లమెంట్‌లో చర్చిస్తున్నారంటే, భవిష్యత్తుపై దృష్టి సారిస్తారని భావించాం. రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదర్శాలు, లక్ష్యాలు సాకారమయ్యేందుకు పథ నిర్దేశం జరుగుతుందని ఆశించాం. భారత స్వాతంత్ర్య శతవర్ష సమారోహం సాగే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎలా తీర్చిదిద్దాలన్న దానిపై మేధా మథనం జరపాలని ఆకాంక్షించాం. ఆ దిశలో సామాన్యుల జీవితాలు మెరుగయ్యేలా లక్షించాల్సింది పోయి విమర్శల పర్వానికే చర్చ పరిమితమైపోవడం శోచనీయం. నిజానికి, ఎవరూ విమర్శలకు అతీతులు కారు. గాంధీ, నెహ్రూలైనా అంతే. వారిని విమర్శించ దలుచుకుంటే నేరుగా విమర్శించవచ్చు. అంతేకానీ, రాజ్యాంగంపై చర్చ పేరిట పరోక్షంగా కొండ రిపై బురద జల్లడం ఏమిటన్నది ఒక వాదన. తాజా చర్చ సందర్భంలో అధికార ఎన్డీఏ వర్గీయులు ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగ నిర్మాతల లక్ష్యాలను తప్పుబడుతున్నారని కూడా ఆరోపణ. అయితే, అసలు భావప్రకటనా స్వేచ్ఛపై సహేతుకమైన పరిమితులు పెట్టవచ్చంటూ తొలి రాజ్యాంగ సవరణ తెచ్చింది కాంగ్రెసే అని బీజేపీ ఎత్తిచూపుతోంది. స్వేచ్ఛ ఉండాలి నిజమే కానీ, అన్ని సమయాల్లోనూ అది నిర్నిబంధమైతే కష్టం గనక సహేతుకమైన పరిమితులు విధించవచ్చని అలా ప్రథమ సవరణతో రాజ్యాంగ రూపకర్తలే దిద్దుబాటు బాట పట్టారన్నది కాంగ్రెస్ వర్గీయుల ప్రతివాదన. రాజ్యాంగ అమలుకు అమృతోత్సవ వేళ చర్చ దాని అమలు తీరుతెన్నులు, భవిష్యత్ సవాళ్ళపైనే సాగాల్సింది. సామూహిక ఆత్మపరిశీలనకు దీన్ని అవకాశంగా మలుచుకోవాల్సింది. కానీ, జరుగుతున్నది వేరు. చర్చంతా రాజకీయ రంగు పులుముకొని, నెహ్రూ కుటుంబం, ఎమర్జెన్సీ, మోదీ సర్కార్ చుట్టూ సాగుతోంది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో అవిశ్వాస తీర్మానంపై చర్చ ఫక్కీలోకి జారిపోయింది. 1975 ఎమర్జెన్సీలోనైనా, ఇప్పుడు 'అప్రకటిత ఎమర్జెన్సీ' ఉందంటున్నా... రెండు సందర్భాల్లో పాలకుల చేతిలో నలిగిపోయింది రాజ్యాంగానికి గుండె లాంటి పౌరుల ప్రాథమిక హక్కులే అని విస్మరించరాదు. ఏళ్ళు గడుస్తున్నకొద్దీ సవాళ్ళు అధికరిస్తున్నాయి. లౌకికవాదం, సమాఖ్య వాదం, న్యాయవ్యవస్థ స్వతంత్రత, దుర్విచక్షణ లేకపోవడం, మైనారిటీల హక్కుల పరిరక్షణ లాంటి రాజ్యాంగ మౌలిక సూత్రాలపైనే ప్రశ్నార్థకాలు పొడసూపుతున్నాయి. సమాన అవకాశాల మాట దేవుడెరుగు, ఆర్థికంగా– సామాజికంగా– లింగపరంగా సమానత్వం సైతం నేటికీ పూజ్యం. అంత రాలు పెరుగుతున్న సమాజంలో అసమానతల నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామా? అన్ని పక్షాలూ ఆత్మావలోకనం చేసుకోవాలి. రాజకీయ పత్రం, దేశ రాజకీయాలకు పునాది అయినప్పటికీ, రాజ్యాంగమనేది అదే సమయంలో రాజకీయాలకు అతీతమైనది. దానిపై చర్చలో ప్రధాని సహా అందరూ సంకుచిత రాజకీయాలకే చోటిస్తే ఇంకేమనాలి? ఈ ధోరణి మారాలి. రాజ్యాంగం ఇన్నేళ్ళుగా జాతికి దిక్సూచిగా నిలిచింది. ప్రభుతకూ, పౌరులకూ ప్రజాస్వామ్య ఫర్మానాగా వెలిగింది. ఆ ఉజ్జ్వల స్ఫూర్తికి కట్టుబడడమే సమస్త సమస్యలకూ పరిష్కారం. సామాన్యుల హక్కులకు శ్రీరామరక్ష.

# తగ్గేదేలే.. బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్..
# అసెంబ్లీలో మాటల యుద్ధం..!



అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌ల హోరు కొనసాగింది. అప్పులపై హరీశ్‌రావు–భట్టి మధ్య మాటల యుద్ధమే జరిగింది. లగచర్ల రైతుకు సంకెళ్లు వేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు నల్ల చొక్కాలతో అసెంబ్లీకి వచ్చారు. చేతికి సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. అసెంబ్లీలో కూడా లగర్ల ఘటనపై చర్చకు పట్టుబట్టారు బీఆర్ఎస్ సభ్యులు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో సభలో దుమారం రేపారు. అరెస్ట్ అయిన లగచర్ల రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ తీరుపై మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతుల గురించి మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్‌కు లేదంటూ మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలోనే ఎంతో మంది రైతులకు బేడీలు వేశారన్నారు మంత్రి సీతక్క. లగచర్ల ఘటనలో అధికారులను సస్పెండ్ చేశామన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసిన ఘటనలను ప్రస్తావిస్తూ అప్పటి ఫోటోలు చూపించారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. అంతకు ముందు క్వశ్చన్ అవర్‌లో అప్పులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్య మాటల యుద్ధం జరిగింది. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం లక్షా 27 వేల 208 కోట్ల అప్పు చేసిందన్నారు హరీశ్‌రావు. ఎఫ్ఆర్‌బీఎం కింద 51 వేల 277 కోట్ల అప్పు తెచ్చిందన్నారు. అప్పుల పరంపరం ఇలానే కొనసాగితే 5 ఏళ్లలో అయ్యే రూ. 6 లక్షల 36 వేల కోట్ల అప్పు అవుతుందన్నారు హరీశ్‌రావు. తాము బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నామన్నారు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క. ఈ విషయంపై ప్రత్యేక డిబేట్ పెడదామన్నారు. అప్పులపై ఆర్థిక మంత్రి సభను ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు హరీశ్‌రావు. అప్పులు, వడ్డీలపై హరీశ్ అబద్ధాలు ఆడుతున్నారంటూ కౌంటర్ ఇచ్చారు భట్టి విక్రమార్క. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే మూడు బిల్లులకు ఆమోదం తెలిపింది అసెంబ్లీ. స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లుతో పాటు యూనివర్సిటీల చట్టసవరణ బిల్లు.. జీఎస్టీ సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర బీజేపీ నిరసనకు దిగింది. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేసింది. కౌలు రైతులకు రుణాలు, పట్టాలు ఇవ్వాలని సీపీఐ డిమాండ్ చేసింది.

### అసెంబ్లీలో ఫార్ములా–ఈ కార్ రేసింగ్ వ్యవహారం:

ఫార్ములా–ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో కేటీఆర్‌తోపాటు బాధ్యులపై చర్యలుంటాయన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలు.. తెలంగాణ రాజకీయాల్లో హీట్ పెంచాయి. కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ ఇచ్చిన అనుమతిని ఏసీబీకి పంపాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. ఏసీబీ విచారణలో కేటీఆర్ సమాధానాలు చెప్పాల్సిందేనన్నారు పొంగులేటి. మంత్రి పొంగులేటి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. వారికీ వీరికి కాదు అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు సమాధానం చెప్పడానికి తాను సిద్ధమన్నారు కేటీఆర్. ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు కేటీఆర్ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందన్నారు జగదీశ్ రెడ్డి. ఈ– కార్ రేసింగ్ వ్యవహారంలో సభలో చర్చపెడితే కేటీఆర్ సమాధానం చెప్తారన్నారాయన. ఈ సందర్భంగా పొంగులేటి కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు ఎమ్మెల్యే వివేకానంద. బీఆర్ఎస్ లీడర్ల కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. కేటీఆర్‌ను జైల్లో పెట్టాలని ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఈ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ నేతల అరెస్టులు తప్పవని కాంగ్రెస్ నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. అయితే కక్ష సాధింపు చర్యలను ప్రజలను హర్షించరంటున్నారు బీఆర్ఎస్ నేతలు.

# రేవంత్ సర్కారు దూకుడు..
# కేసీఆర్ కేసు? అమెరికాకు వెళ్లలేరిక..?



కేటీఆర్ ను ఫార్ములా– ఈ కార్ రేసులో బుక్ చేస్తున తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో పెద్ద అడుగు వేయబోతోంది.. ఈసారి ఏకంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను కేసులో బుక్ చేయనుంది. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న విద్యుత్తు ఒప్పందాలపై మొదటినునంచి తీవ్ర ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి రాగానే వాటినే లక్ష్యంగా చేసుకుంది. ఇక కేసీఆర్ సర్కారు యాదాద్రి, భద్రాద్రి పేరిట విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం చేపట్టారు. అయితే, వీటిలో అక్రమాలు జరిగాయంటూ రేవంత్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ మేరకు జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ కమిషన్ ను విచారణకు నియమించింది. జస్టిస్ లోకూర్ నివేదికకు ఓకే.. తాజాగా జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదికను తెలంగాణ మంత్రివర్గం ఆమోదించింది. దీంతో విద్యుత్తు నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించిన కేసీఆర్, ఇతర పాత్రధారులపై చర్యలకు సర్కారు నిర్ణయించింది. అంతేగాక ఈ జస్టిస్ లోకూర్ నివేదికను శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని తీర్మానించింది. సభలో విస్తృతంగా చర్చించాక కేసీఆర్ పై తీసుకునే చర్యలను అసెంబ్లీలోనే ప్రకటించనుంది. అనంతరం కేసీఆర్ సహా పలువురిపై ప్రభుత్వం కేసు పెడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. గమనార్హం ఏమంటే.. సీఎం రేవంత్ అధ్యక్షతన సోమవారం 5 గంటలపాటు మంత్రివర్గ సమావేశం జరిగింది. విద్యుత్తు కమిషన్ నివేదికపైనే సుదీర్ఘంగా చర్చించారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నిర్ణయాలు డిస్కమ్ లను ఆర్థికంగా కుప్పకూల్చాయని.. అయినా అధికారులు కేసీఆర్ మెప్పు కోసం తలూపారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా విద్యుత్తు కొనుగోళ్లు, పవర్ ప్లాంట్ల నిర్మాణంలో 25 ఏళ్లలో తెలంగాణ మూల్యం చెల్లించుకోనుందని తేల్చింది. కాలం చెల్లిన టెక్నాలజీతో కట్టిన భద్రాద్రి పవర్ ప్లాంట్ తో రూ.9 వేల కోట్ల దాకా ప్రజలపై భారం పడుతుందని తెలంగాణ క్యాబినెట్ పేర్కొంది. ఇక ఛత్తీస్ గఢ్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందంతో రూ.3,642 కోట్ల నష్టం జరిగిందని జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదిక తేల్చింది. దీనిపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. శ్వేతపత్రం విడుదల చేసి మరీ.. రేవంత్ ప్రభుత్వం వస్తూనే.. తెలంగాణలో విద్యుత్తు రంగంపై అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేసింది. దీంతో విద్యుత్తు కొనుగోళ్లపై విచారణ జరిపించాలని బీఆర్ఎస్ శాసన సభ్యులు సవాల్ విసిరారు. ఆ మేరకు ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. మార్చి 14న జస్టిస్ ఎల్.నర్సింహా రెడ్డి నేతృత్వంలో కమిషన్ ను నియమించింది. విచారణ నివేదిక ఇస్తారనే క్రమంలో సుప్రీం కోర్టు తీర్పుతో జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి తప్పుకొన్నారు. దీంతో జూలై 29న జస్టిస్ లోకూర్ కమిషన్ ను వేశారు. ఆయన సమర్పించిన నివేదిక ఆధారంగానే తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్లనుంది. మరి అమెరికా టూరో? త్వరలో కేసీఆర్ అమెరికా పర్యటనకు వెళ్తారనే కథనాలు వచ్చాయి. కానీ, ఇప్పుడు కేసు నమోదైతే ఎలా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

# కేంద్ర ప్రభుత్వం పడిపోతే అప్పుడెలా?




కేంద్ర రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ప్రధాని మోదీ బలంగా కోరుకుంటున్నారు. తరచూ ఎన్నికలు రావడం వల్ల డెవలప్మెంట్ నిలిచిపోతుందని చెబుతున్నారు. అయితే ఈ బిల్లుక పార్లమెంటు ఆమోదం లభిస్తుందా? కేంద్ర ప్రభుత్వమే పదవీకాలానికి ముందు పడిపోతే అప్పుడేం చేస్తారు? జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టడంతో దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఒక దేశం ఒకే ఎన్నిక భావనతో ముందుకొచ్చిన జమిలి బిల్లుతో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆటంకం లేని పాలన కోసం మొదలైన కసరత్తు ఎలాంటి ముగింపునిస్తుంది? ఏదైన రాష్ట్ర ప్రభుత్వం మధ్యలో కూలిపోతే తదుపరి సార్వత్రిక ఎన్నికల వరకు రాష్ట్రపతి పాలన విధించడమో, మధ్యాంతర ఎన్నికలు నిర్వహిస్తే మిగిలిన గడువుకే కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు. మరి కేంద్రంలో ప్రభుత్వమే మధ్యలో పడిపోతే అప్పుడు ఏం చేస్తారనే కీలక ప్రశ్నకు సరైన సమాధానం లభించడం లేదు. వన్ నేషన్ – వన్ ఎలక్షన్ అంటూ గద దశాబ్ద కాలంగా బీజేపీ నినదిస్తోంది. వివిధ దశలు, చర్చలు జరిగిన తర్వాత ఎట్టకేలకు పార్లమెంటు ముందుకొచ్చింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే ఈ ప్రతిపాదనకు పార్లమెంట్లో 2/3 వంతు మెజార్టీ అవసరం. ప్రస్తుతం కేంద్రంలో అధికారం చలాయిస్తున్న ఎన్డీఏకి ఆ స్థాయిలో బలం లేకపోవడంతో ప్రతిపక్షాల మద్దతు అవసరం. ఇంతటి కీలకమైన బిల్లుకు ప్రతిపక్షాలు ఆమోదం తెలుపుతాయా? లేదా? అనే విషయం పక్కన పెడితే ఈ బిల్లుపై కొన్ని సందేహాలు జమిలి బిల్లుకు చిక్కులు తెచ్చేలా కనిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనేది ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. దీనికి ప్రాతిపదికగా 2029 సార్వత్రిక ఎన్నికలను తీసుకున్నారు. ఆ సమయానికి దేశవ్యాప్తంగా ఉన్న అసెంబ్లీలను రద్దు చేసి పార్లమెంట్ తోపాటే రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపాదిస్తున్నారు. ఈ ఎన్నిక తర్వాత దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా పదవీకాలానికి ముందే సభ్యుల విశ్వాసం కోల్పోయి, మధ్యాంతర ఎన్నికలు నిర్వహించాల్సివస్తే, తదుపరి సార్వత్రిక ఎన్నికల వరకు మిగిలిన పదవీకాలానికి ఎన్నిక నిర్వహిస్తామని బిల్లులో స్పష్టం చేశారు. అయితే రాష్ట్రాల వరకు దీనిపై క్లారిటీ ఉన్నా, కేంద్ర ప్రభుత్వమే పార్లమెంటు విశ్వాసాన్ని కోల్పోతే అప్పుడు ఏం చేస్తారనేది మిస్టరీగా మారింది.మన దేశంలో మధ్యాంతర ఎన్నికలు జరగడమనేది కొత్తేమీ కాదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో కేంద్ర, రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించారు. 1968లో హర్యానా, కేరళ రాష్ట్రాలకు మధ్యాంతరం రావడంతో బ్రేక్ పడింది. ఆ తర్వాత 1970లో కేంద్ర ప్రభుత్వం రద్దు కావడంతో పార్లమెంటుకు రాష్ట్రాలకన్నా ముందే ఎన్నికలు నిర్వహించాల్సివచ్చింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ఎన్నికలు రకరకాల సమయాల్లో జరగడం మొదలైంది. ఇక 1996 నుంచి 1999 మధ్య మైనార్టీ ప్రభుత్వాలు ఏర్పడటంతో పార్లమెంటుకు మధ్యాంతర ఎన్నికలు జరిగాయి. 2004 నుంచి 2024 వరకు యూపీఏ, ఎన్డీఏ ప్రభుత్వాలు సంపూర్ణ మెజార్టీతో ఏర్పడ్డాయి. 2014, 2019 ఎన్నికల్లో బీజేపీకి సింగిల్గా మెజార్టీ ఉండటంతో ప్రభుత్వం సుస్థిరంగా కొనసాగుతోంది. 2024లో బీజేపీకి సొంతంగా బలం లేకపోయినా ఎన్డీఏ కూటమి పార్టీల మద్దతుతో మోదీ ప్రభుత్వం మూడోసారి కొలువుదీరింది. ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వానికి ముప్పేమీ లేకపోయినా, భవిష్యత్లో కూటమి మధ్య భేదాభిప్రాయాలు పొడచూపితే? పరిస్థితి ఎక్కడికైనా దారితీయొచ్చు. అదేవిధంగా 2029 తర్వాత ఏ పార్టీకి సంపూర్ణ మెజార్టీ లభించకపోతే సంకీర్ణ ప్రభుత్వాలే పాలన సాగించొచ్చు. మన దేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఎంతటి స్థిరత్వంతో పనిచేశాయనే అనుభవం ఉంది. ఈ పరిస్థితుల్లో జమిలి ఎన్నికల బిల్లులో ఈ ప్రశ్నకు ఎలాంటి సమాధానం లభిస్తుందనే ఆసక్తి వ్యక్తమవుతోంది.

# స్పోర్ట్స్ న్యూస్




## కంగారూ గడ్డపై ఒకే ఒక్క భారతీయుడు..
## కపిల్ దేవ్ తర్వాత ఇతడే

పేస్ బౌన్స్ స్వింగ్ కలగలిసిన ఆస్ట్రేలియా పిచ్ లపై బౌలింగ్ అంటే మామూలు మాటలు కాదు.. ఎంత పదునుగా బంతులు వేసినా, చివరకు ఒక్క లూజ్ బాలు చాలు.. బ్యాట్స్ మెన్ చెలరేగిపోయేందుకు అవకాశం దక్కినట్లే. అందుకే భారత ఫాస్ట్ బౌలర్లు ఎవరూ కంగారూ గడ్డపై రాణించిన దాఖలాలు లేవు.. ఒక్క కపిల్ దేవ్ తప్ప.. అయితే, ఇప్పుడు మాత్రం ఆ రికార్డును బద్దలుకొట్టాడు ఓ మొనగాడు.

**ఒకే ఒక్కడు..**

వైవిధ్యమైన బౌలింగ్ శైలితో భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అరుదైన ఘనత సాధించాడు. ఆస్ట్రేలియాలో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్ గా అతడు చరిత్రకెక్కాడు. బ్రిస్బేన్ లోని గబ్బా మైదానంలో జరుగుతున్న మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్ లో లబుషేన్ ను ఔట్ చేశాడు. దీంతో కంగారూ నేలపై బుమ్రా తీసిన వికెట్ల సంఖ్య 52కి చేరింది. కపిల్ రికార్డు (51)ను అధిగమించాడు. అయితే, కపిల్ 11 టెస్టుల్లో 51 వికెట్లు తీయగా.. బుమ్రా 10 టెస్టుల్లోనే ఆ మార్క్ ను చేరాడు. ఇక లెగ్ స్పిన్నర్ అనిల్ కుంబ్లే (49), తాజాగా రిటైర్మెంట్ ప్రకటించి అశ్విన్ (40), మాజీ దిగ్గజం బిషన్ సింగ్ బేడీ (35).. బుమ్రా, కపిల్ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

**బుమ్రా.. నేను గూగుల్ చేశా..: పిచాయ్**

బుమ్రా ఎంతటి వైవిధ్యమైన పేస్ బౌలరో అందరికీ తెలిసిందే. అయితే, అతడిలో కొంత బ్యాటింగ్ సామర్థ్యమూ ఉంది. ఇంగ్లండ్ లో గతంలో పర్యటించినప్పుడు బుమ్రా ఒకే ఓవర్ లో 35 పరుగులు సాధించాడు. ఇది 2022లో జరిగింది. ఇది ప్రపంచ రికార్డు కూడా. ఆస్ట్రేలియాతో తాజా మూడో టెస్టులో బుమ్రా టీమ్ ఇండియాకు ఫాలో ఆన్ తప్పించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆస్ట్రేలియాలో రెండో ఇన్నింగ్స్ లో వికెట్లు పడిన విధానం చూస్తే.. బుమ్రా (38 బంతుల్లో 10 నాటౌట్) ఇన్నింగ్స్ కు ఉన్న విలువ తెలుస్తుంది. సహచర పేసర్ ఆకాశ్ దీప్ (27)తో కలిసి బుమ్రా భారత్ ను ఫాలో ఆన్ తప్పించాడు. అయితే ,ఈ ఇన్నింగ్స్ కు ముందు బుమ్రా ఆస్ట్రేలియా మీడియాతో మాట్లాడాడు. మూడో రోజు ఆట తర్వాత గబ్బాలో బ్యాటింగ్ పరిస్థితుల గురించి ప్రశ్న రాగా.. "మీరు నా బ్యాటింగ్ సామర్థ్యాన్ని ప్రశ్నిస్తున్నారు. టెస్టుల్లో ఒకే ఓవర్ లో అత్యధిక పరుగులు చేసింది ఎవరో గూగుల్ చేయండి." అని చెప్పాడు. అతడు ఫన్నీగా చెప్పినా అది వైరల్ అయింది. కొందరు బుమ్రా 35 పరుగులు సాధించిన ఓవర్ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. అన్నిటికి మించిన హైలైట్ ఏమంటే.. క్రికెట్ అంటే ఎంతో ఇష్టపడే గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తాజాగా బుమ్రా వ్యాఖ్యలపై స్పందించాడు. బుమ్రా బ్యాటింగ్ గురించి తాను గూగుల్ చేసినట్లు చెప్పారు. అంతేకాదు.. ఆసీస్ కెప్టెన్ కమిన్స్ వంటి పేసర్ బౌలింగ్ లో సిక్స్ కొట్టినవారికి బ్యాటింగ్ ఎలా చేయాలో చాలా బాగా తెలుసని కూడా వ్యాఖ్యానించారు. మూడో టెస్టులో భారత్ ను ఫాలోఆన్ గండం తప్పించన వైనాన్ని పేర్కొన్నారు.

**గూగుల్ ఫిదా..**

తన బ్యాటింగ్ రికార్డులు తెలుసుకోవాలంటే గూగుల్ చేయండి అంటూ బుమ్రా చేసిన వ్యాఖ్యలతో గూగుల్ కూడా ఫిదా అయినట్లుంది. గూగుల్ ఇండియా సైతం బుమ్రా వీడియోను పోస్ట్ చేస్తూ మేము.. జస్సీ భాయ్‌ని మాత్రమే నమ్ముతాం అని రాసుకొచ్చింది.




## చాంపియన్స్ ట్రోఫీ:
## భారత్ పాక్ వెళ్లదు..టి20 కప్ భారత్ కు పాక్ రాదు

హై. .హై.. హైబ్రిడ్.. 'దుబాయ్' లైన్ క్లియర్..న అక్కడా ఇక్కడా కాదు.. ఆడేద్దాం దుబాయ్ లో అంటూ చాంపియన్స్ ట్రోఫీకి సిద్ధమవుతోంది టీమ్ ఇండియా. సరిగ్గా రెండు నెలలు కూడా సమయం లేదు.. అటు చూస్తే ఆతిథ్య దేశం పాకిస్థాన్ పట్టువీడడం లేదు. భారత్ మాత్రం తాము పాకిస్థాన్ లో పర్యటించేది లేదు అని చెబుతోంది. దీంతో చాంపియన్స్ ట్రోఫీ సందిగ్ధంలో పడింది. వన్డే ప్రపంచ కప్ తర్వాత పెద్ద టోర్నీ అయిన చాంపియన్స్ ట్రోఫీ అసలు జరుగుతుందా? లేదా? అని అనుమానం నెలకొంది. దాదాపు నాలుగు నెలలుగా చాంపియన్ ట్రోఫీ నిర్వహణపై రగడ రగడ జరుగుతోంది. భారత్ తమ దేశానికి రాకుంటే తాము ఆ దేశానికి వెళ్లేది లేదని పాకిస్థాన్ పట్టుపట్టింది. అటు చూస్తే సమయం దగ్గర పడుతోంది. పైగా ఈసారి టోర్నీని వన్డే ఫార్మాట్ లో నిర్వహిస్తున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. అయితే, ఎట్టకేలకు ఈ సందిగ్ధతకు తెరపడింది. హైబ్రిడ్ క్ ఓకే.. చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ విధానంలో నిర్వహించేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆమోదం తెలిపింది. ఈ మేరకు పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ), భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) మధ్య ఒప్పందం కుదిరింది. హైబ్రిడ్ మోడల్ అంటే.. ఏమీ లేదు.. కొన్ని మ్యాచ్ లు ఆతిథ్య దేశంలో, మిగతావి వేరే దేశంలో జరగడం. %శూశ్రీంశీ =ఖుం% – 500 వికెట్ల టీమ్ ఇండియా సీనియర్ ఆఫ్ స్పిన్నర్ అనూహ్య రిటైర్మెంట్ భారత్ కు దుబాయ్.. పాకిస్థాన్ లోని నాలుగు నగరాల్లో 2025 ఫిబ్రవరిలో చాంపియన్స్ ట్రోఫీ మొదలుకానుంది. భారత్ మ్యాచ్ లు దుబాయ్ లో జరగనున్నాయి. మిగిలినవి పాక్ లోనే జరుగుతాయి. ఒకవేళ భారత జట్టు సెమీఫైనల్, ఫైనల్ చేరితే ఆ మ్యాచ్ లు కూడా దుబాయ్ లోనే నిర్వహిస్తారు. భారత్ ముందుగానే నిష్క్రమిస్తే ఈ మ్యాచ్ లు లాహోర్, రావల్పిండిలో జరుగుతాయి. కాగా, పీసీబీకి ఐసీసీ మరో ఆఫర్ కూడా ఇచ్చారందట. 2027 తర్వాత జరిగే మహిళల ఐసీసీ టోర్నీ ఆతిథ్య హక్కులు పాక్ కు కేటాయించినట్లు సమాచారం. పాక్ భారత్ కు రాదు.. భారత్ లో 2026 టి20 ప్రపంచ కప్ జరగనుంది. ఇందుకోసం పాకిస్థాన్ జట్టు భారత్ కు రాదు. దాని మ్యాచ్‌లు శ్రీలంక రాజధాని కొలంబోలో జరుగుతాయి. కాగా, చాంపియన్స్ ట్రోఫీపై సందిగ్ధం తొలగడంతో త్వరలో షెడ్యూల్ రానుంది. ఈ టోర్నీ ప్రారంభానికి మూడున్నర నెలు (100 రోజులు) ముందుగానే షెడ్యూల్ ఇవ్వాలి. కానీ భారత్, పాకిస్థాన్ క్రికెట్ బోర్డుల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా ఐసీసీ వాయిదా వేసింది.




## బిగ్.. బిగ్ డెసిషన్..
## అంతర్జాతీయ క్రికెట్ కు రోహిత్ శర్మ గుడ్ బై?

భారత క్రికెట్ లో శకం ముగిసిందా..? వన్డేల్లో ఒక డబుల్ సెంచరీనే కష్టం అనుకుంటే.. మూడు డబుల్ సెంచరీలు కొట్టిన మొనగాడు ఇక బ్యాట్ వదిలేస్తున్నాడా? టి20ల్లో రికార్డు స్థాయిలో ఐదు సెంచరీలు కొట్టిన బ్యాట్స్ మన్ ఇక తప్పుకోనున్నాడా..? టెస్టుల్లో అరంగేట్రంలోనే సెంచరీ బాది.. ఆపై ఆ ఫార్మాట్ కు తగినవాడు కాదని అనిపించుకున్న ఆటగాడు చివరకు టెస్టు కెప్టెన్ గా ఉంటూనే రిటైర్ కానున్నాడా?.. ఈ ప్రశ్నలన్నిటికీ ఔననే సమాధానమే వస్తోంది.

**ఇక సెలవ్..**

టీమ్ ఇండియా టెస్టుల, వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ టెస్టు ఫార్మాట్ కు వీడ్కోలు పలుకుతున్నాడనే ఊహాగానాలు హల్ చల్ చేస్తున్నాయి. ఆస్ట్రేలియాతో ప్రస్తుతం జరుగుతున్న బోర్డర్ గావస్కర్ సిరీస్ లో దారుణంగా విఫలం అవుతున్న రోహిత్ ఇక సుదీర్ఘ ఫార్మాట్ ను వదిలేస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. ఆస్ట్రేలియాతో మూడో టెస్టులో రోహిత్ రెండో ఇన్నింగ్స్ లోనూ విఫలమయ్యాడు. దీనికిముందు గులాబీ టెస్టులో రెండు ఇన్నింగ్స్ లోనూ రాణించలేకపోయాడు. ఇక బ్రిస్బేన్ లో జరుగుతున్న మూడో టెస్టులో 10 పరుగులే చేసి ఔటయ్యాడు. దీంతో డగౌట్ వద్దనే తన గ్లౌజ్ లు పడేసి వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో రోహిత్ రిటైర్మెంట్ పై వార్తలు వస్తున్నాయి.

**పేలవ ఫామ్..**

2, 52, 0, 8, 18, 11, 3, 6, 10.. ఇవీ రోహిత్ శర్మ ఇటీవలి టెస్టు స్కోర్లు. 9 ఇన్నింగ్స్ లో ఒక్కటే హాఫ్ సెంచరీ. దీనికిముందు శ్రీలంకతో వన్డే సిరీస్ లోనూ విఫలమయ్యాడు. కనీసం క్రీజులో నిలవలేకపోతున్నాడు. బ్రిస్బేన్ లోని గబ్బా మైదానంలో జరుగుతున్న మూడో టెస్టులో ఆసీస్ కెప్టెన్ కమ్మిన్స్ వేసిన బంతిని రోహిత్ అత్యంత పేలవంగా ఆడాడు. గులాబీ టెస్టులోనూ బంతిని ఆడేందుకు చాలా ఇబ్బంది ఎదుర్కొన్నాడు. తాజా టెస్టులో ఔట్ అనంతరం తీవ్ర అసంతృప్తితో రోహిత్ తన గ్లౌజ్ లను డగౌట్ వద్దే పడేసి డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయాడు. రోహిత్ స్వభావానికి భిన్నంగా ప్రవర్తించిన ఈ సంఘటనతో.. అతడు టెస్టులకు వీడ్కోలు పలుకుతాడనే ప్రచారం మొదలైంది. వాస్తవానికి ఈ సిరీస్ లో రోహిత్ ఓపెనింగ్ లో కాకుండా 6వ స్థానంలో వస్తున్నాడు. అయినా పరుగులు చేయలేకపోతున్నాడు. ఇదే కాదు.. రెండేళ్లలో 10 టెస్టుల్లో 18 ఇన్నింగ్స్ కు గాను 621 పరుగులే చేశాడు రోహిత్. ఒకటే సెంచరీ కొట్టాడు. 66 టెస్టులాడిన రోహిత్.. 4,289 పరుగులు చేశాడు. 212 అత్యధిక స్కోరు. 12 సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలు కొట్టాడు.

**వన్డేలకు కూడానా?**

రోహిత్ కు మరొక 4 నెలల్లో 38 ఏళ్లు నిండనున్నాయి. అతడు జూన్ లో టి20 ప్రపంచ కప్ గెలిచాక ఆ ఫార్మాట్ కు వీడ్కోలు పలికాడు. ఇప్పుడు టెస్టులకూ బైబై చెప్పనున్నాడని అంటున్నారు. ఇక మిగిలింది వన్డేలు. ఈ ఫార్మాట్ లో అతడే కెప్టెన్. అయితే, ఫామ్ గొప్పగా లేనందున వన్డేలకూ రోహిత్ రాం రాం చెప్పే చాన్సుందని తెలుస్తోంది. అదే జరిగితే భారత క్రికెట్ లో ఓ అద్భుత శకం ముగిసినట్లే.

## వికెట్ల టీమ్ ఇండియా
## సీనియర్ ఆఫ్ స్పిన్నర్ అనూహ్య రిటైర్మెంట్



500 భారత క్రికెట్ లో దిగ్గజ ఆటగాళ్ల నిష్క్రమణ పరంపర కొనసాగుతోంది.. టి20 ప్రపంచ కప్ గెలిచిన అనం తరం స్టార్ బ్యాట్స్ మెన్ విరాట్ కోహ్లి, కెప్టెన్ రోహిత్ శర్మ, మేటి ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాలు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. మరోవైపు రోహిత్ శర్మ ఇప్పటికే టెస్టులకు వీడ్కోలు పలుకుతాడనే ఊహాగానాలు వస్తున్నాయి. అయితే, దీనికి భిన్నంగా టీమ్ ఇండియా సీనియర్ ఆఫ్ స్పిన్నర్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలగాడు.

మరో రెండేళ్లు ఆడతాడనుకుంటే?

అంతర్జాతీయ క్రికెట్ కు టీమ్ ఇండియా సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రిటైర్ మెంట్ ప్రకటించాడు. గబ్బాలో ఆస్ట్రేలియాతో మూడో టెస్ట్ ముగిసిన అనంతరం వెల్లడించాడు. 38 ఏళ్ల అశ్విన్ 106 టెస్టుల్లో 537 వికెట్లు పడగొట్టాడు. 116 వన్డేల్లో 156 వికెట్లు, 65 టి20ల్లో 72 వికెట్లు తీశాడు. టెస్టుల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్ల జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. దిగ్గజ లెగ్ స్పిన్నర్ అనిల్ కుంబ్లే (619) టాప్ లో ఉన్నాడు. వాస్తవానికి అశ్విన్ మరో దాదాపు రెండేళ్ల వరకైనా అంతర్జాతీయ క్రికెట్ లో కొనసాగుతాడని అనుకున్నారు. కానీ, అనూహ్యంగా నిర్ణయం తీసుకున్నాడు.

ఎందుకని ఈ నిర్ణయం?

అశ్విన్ అకస్మాత్తుగా నిర్ణయం తీసుకోవడానికి కారణం.. అతడు కొంతకాలంగా వికెట్లు తీయడంలో వెనుకబడ్డాడు. ఈ నెల 6 నుంచి జరిగిన గులాబీ టెస్టులో ఆడించినప్పటికీ మెరుగైన ప్రదర్శన చేయలేదు. న్యూజిలాండ్ తో మూడు టెస్టుల సిరీస్ లో 6 ఇన్నింగ్స్ లో 9 వికెట్లు మాత్రమే తీశాడు. దీంతోనే అశ్విన్ పని అయిపోయిందనే విమర్శలు వచ్చాయి. దీనికితోడు వయసు కూడా మీద పడింది. ఈ నేపథ్యంలోనే రిటైర్మెంట్ ఇచ్చినట్లు స్పష్టం అవుతోంది. అశ్విన్ 2017 చాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డే జట్టులో రెగ్యులర్ సభ్యుడిగా లేడు. అడపాదడపా వన్డే జట్టులోకి వచ్చి పోతున్నాడు. 2023లో చివరి వన్డే ఆడాడు. 2022లో చివరిగా టి20ల్లో ప్రాతినిధ్య వహించాడు. అయితే, టి20ల్లో చాలా కాలం కిందటే అతడిని పక్కనపెట్టారు. టెస్టుల్లోనూ ప్రదర్శన పడిపోవడంతో రిటైర్మెంట్ ప్రకటించేశాడు.




# రష్మిక మందన్న రెబల్ స్టైల్




ప్రస్తుతం 'పుష్ప 2' గ్రాండ్ సక్సెస్ ని ఆస్వాధిస్తోంది రష్మిక మందన్న. శ్రీవల్లిగా తన అద్భుత నటనకు ప్రశంసలు అందుకున్న ఈ బ్యూటీ తదుపరి 'సికందర్' చిత్రంపైనా దృష్టి సారించింది. ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్ సరసన రష్మిక నటిస్తున్న సంగతి తెలిసిందే. ఏ.ఆర్.మురుగదాస్ తెరకెక్కిస్తున్నారు. మరోవైపు రష్మిక వరుస ఫోటోషూట్లు అంతర్జాలంలో వైరల్ అవుతున్నాయి. తాజాగా 'కాస్మోపాలిటన్' మ్యాగజైన్ కవర్ పేజీ కోసం రష్మిక ఫోటోషూట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కాస్మో ఇండియా నవంబర్-డిసెంబర్ సంచిక కోసం ఫోటోషూట్ ఇది. ఇప్పటికే కొన్ని స్టిల్స్ అంతర్జాలంలోకి రిలీజయ్యాయి. తాజాగా మరో స్పెషల్ ఫోటోషూట్ ని కాస్మోఇండియా ఇన్ స్టాలో షేర్ చేయగా వైరల్ గా మారింది. ఈ ఫోటోషూట్‌లో రష్మిక యూనిక్ స్టైల్ లో కనిపించింది. కొంత బోల్డ్ గా కనిపించినా యూనిక్ ఫోటోగ్రఫీతో కాస్మో ఇండియా షూట్ ఆకర్షిస్తోంది. రష్మిక మందన్న రెబల్ స్టైల్ ఆకట్టుకుంటోందంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. తాజాగా షేర్ చేసిన ఫోటోగ్రాఫ్ తో పాటు రష్మిక మందన ఇంటర్వ్యూ నుంచి కొన్ని ఆసక్తికర విషయాలను కాస్మో ఇండియా ఇన్ స్టాలో షేర్ చేసింది. నటిగా ప్రేక్షకుల తీర్పు కోసం ఎదురు చూసేప్పుడు భయం ఉంటుందని, పుష్ప 2 విడుదల సమయంలో అలాంటి భయంతో గడిపానని రష్మిక మందన కాస్మో ఇండియా ఇంటర్వ్యూలో తెలిపారు. ఎల్లప్పుడూ తీర్పు బాధపెడుతుందనే భయం ఉండనే ఉంటుంది. నాకు ఎప్పుడూ ఏదో ఒక భయం ఉన్నట్లు అనిపిస్తుంది. 'పుష్ప' చిత్రీకరణను ముగించిన రోజు నేను మూడు-నాలుగు గంటలు ఏడ్చేంతగా భావోద్వేగాలతో మునిగిపోయాను. చిత్రీకరణ పూర్తయిందనే ఉద్వేగం.. ఇలాంటి ప్రక్రియ ముగియాలని నేను కోరుకోలేదు.. ఆరోజు చాలా ఎమోషన్‌కి గురయ్యాను.. అని తెలిపింది. సల్మాన్ తో 'సికందర్' తర్వాత బన్నీతో 'పుష్ప 3'లోను రష్మిక నటించనుంది.

# స్టైలిష్ డ్రెస్‌లో క్యూట్ శ్రీలీల

రాఘవేంద్ర రావు కొత్త 'పెళ్లి సందడి' ముద్దుగుమ్మ శ్రీలీల టాలీవుడ్‌లో ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా వరుస సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్‌గా వరుస సినిమాలు చేస్తున్న శ్రీలీల సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా ఈ అమ్మడు మరోసారి తన అందమైన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేయడంతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. స్టైలిష్ డ్రెస్‌లో క్యూట్ శ్రీలీల భలే అందంగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆమె ఫ్యాన్స్ తెగ లైక్ చేస్తూ షేర్ చేస్తున్నారు.శ్రీలీల రెగ్యులర్‌గా కనిపించే ఔట్ ఫిట్‌లో కాకుండా ఈసారి చాలా విభిన్నమైన స్టైలిష్ కాస్ట్యూమ్స్‌ను ట్రై చేసింది. సన్నగా నాజూకుగా ఉండే శ్రీలీలకు ఎలాంటి డ్రెస్ అయినా సెట్ అవుతుంది అంటూ ఈ ఫోటోలను చూస్తే అర్థం అవుతుంది. క్లీవేజ్ షో, చీర కట్టు ఫోటోలు, నడుము అందం చూపించిన ఫోటోలు చాలానే వైరల్ అయ్యాయి. అయితే ఈసారి పెద్దగా స్కిన్ షో చేయకున్నా శ్రీలీల ఈ ఫోటోలతో వైరల్ కావడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి ఈ ఫోటోలు చెప్పకనే చెబుతున్నాయి అనేది ఫ్యాన్స్ అభిప్రాయం.ఈ ఏడాది ఆరంభంలో గుంటూరు కారం సినిమాతో మహేష్ బాబుతో కలిసి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా బక్సాఫీస్ వద్ద నిరాశ పరచింది. అయినా శ్రీలీల క్రేజ్ తగ్గలేదు. అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప 2 సినిమాలో అయిదు నిమిషాల ఐటెం సాంగ్ కోసం ఏకంగా రూ.2 కోట్ల పారితోషికం తీసుకుంది. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో రూపొందుతున్న రాబిన్‌హుడ్ సినిమాలో నితిన్‌కు జోడీగా నటించడం ద్వారా మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయ్యింది. పుష్ప 2 సినిమా పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో కిస్సిక్ సాంగ్ చేసిన శ్రీలీలకు అంతే స్థాయిలో గుర్తింపు లభించింది. అందుకే హిందీ, తమిళ్ సినిమాల్లోనూ ఈమెకు నటించేందుకు ఆఫర్లు వస్తున్నాయి. కానీ తెలుగులో మాత్రమే ఎక్కువ సినిమాలు చేస్తున్న ఈమె తమిళ్‌లో ఒక స్టార్ హీరోకు జోడీగా నటించేందుకు ఓకే చెప్పింది. త్వరలో ఈ అమ్మడు నవీన్ పొలిశెట్టి హీరోగా రూపొందబోతున్న సినిమాలో నటించబోతుంది. ఇటీవల బాలకృష్ణ టాక్ షో కి వచ్చిన సమయంలో ఆ విషయమై క్లారిటీ వచ్చింది.






# సంక్రాంతి సినిమాలు..

# రన్ టైమ్ ఎంత?

ఏటా సంక్రాంతికి బాక్సాఫీస్ వద్ద అనేక సినిమాలు రిలీజ్ అవుతాయన్న విషయం తెలిసిందే. 2024 సంక్రాంతికి గట్టి పోటీనే నెలకొంది. నాలుగు తెలుగు స్ట్రయిట్ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఇప్పుడు 2025 పొంగల్ వచ్చేస్తోంది. ముందు ఏవేవో పేర్లు వినిపించినా.. ఈ ఏడాది కూడా నాలుగు సినిమాలు ఫిక్స్ అయిపోయాయి.మెగా హీరో రామ్ చరణ్ గేమ్ ఛేంజర్, గాడ్ ఆఫ్ ది మాసెస్ బాలకృష్ణ డాకు మహారాజ్, విక్టరీ వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాలు పొంగల్ బరిలో దిగనున్నాయి. కోలీవుడ్ హీరో అజిత్ విదాముయార్చి కూడా అప్పుడే రానుంది. దీంతో ఇప్పుడు ఈ సినిమాల రన్ టైమ్ కోసం ఇప్పుడు నెట్టింట డిస్కషన్ జరుగుతోంది.కోలీవుడ్ ప్రముఖ నిర్మాత శంకర్ దర్శకత్వం వహిస్తున్న గేమ్ ఛేంజర్.. జనవరి 10వ తేదీన విడుదల కానుంది. రామ్ చరణ్ విభిన్నమైన రోల్స్ లో సినిమాలో కనిపించనున్నారు. ఇప్పటికే ప్రమోషన్స్ ద్వారా మంచి అంచనాలు నెలకొల్పిన గేమ్ ఛేంజర్ రన్ టైమ్.. రెండు గంటల 50 నిమిషాలు ఉంటుందని టాక్ వినిపిస్తోంది. వరుస హిట్స్ తో దూసుకుపోతున్న బాలయ్య.. ఇప్పుడు డాకు మహారాజ్ చిత్రంతో సంక్రాంతి బరిలో దిగుతున్నారు. బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా.. జనవరి 12న రిలీజ్ అవ్వనుంది. ఆడియన్స్ కు మంచి మాస్ ట్రీట్ అందించేలా కనిపిస్తున్న డాకు మహారాజ్ మూవీ నిడివి.. 2 గంటల 45 నిమిషాలని వినికిడి. ఎఫ్-2, ఎఫ్-3 చిత్రాలు మంచి హిట్స్ అవ్వడంతో ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాం మూవీపై అంతా భారీ అంచనాలు పెట్టుకున్నారు. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా.. జనవరి 14న థియేటర్లలో సందడి చేయనుంది. ఆ మూవీ రన్ టైమ్.. రెండు గంటల 40 నిమిషాలుగా తెలుస్తోంది. టాలీవుడ్ లో కూడా స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉన్న అజిత్.. విదాముయార్చితో సంక్రాంతికి సందడి చేయనున్నారు. తిరుమేని దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఆ సినిమా.. రన్ టైమ్ 2 గంటల 45 మినిట్స్ అని సమాచారం. అలా సంక్రాంతికి వచ్చే నాలుగు చిత్రాలు కూడా 3 గంటల్లోపు రన్ టైమ్ తోనే ఉండనున్నాయన్నమాట. మరి ఆ విషయం ఏ సినిమాకు ఎంతవరకు ప్లస్ అవుతుందో వేచి చూడాలి.

# పట్టు చీరలో పుత్తడి బొమ్మ



సినిమా ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చి పదేళ్లు అవుతున్నా మాళవిక మోహనన్ ఇప్పటి వరకు తెలుగులో ఒక్క సినిమా చేయలేదు. కానీ తెలుగులో మంచి గుర్తింపు దక్కించుకుంది. అందాల ఆరబోత ఫోటోలతో పాటు, డబ్బింగ్ సినిమాల కారణంగా ఈ అమ్మడికి మంచి గుర్తింపు లభించింది అనడంలో సందేహం లేదు. తెలుగులో ఈ అమ్మడు సుదీర్ఘ వెయిటింగ్ తర్వాత ప్రభాస్ వంటి పాన్ ఇండియా స్టార్ హీరోతో రాజాసాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆలస్యంగా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నా ఒక మంచి సాలిడ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నందుకు చాలా సంతోషంగా ఉందని చెప్పుకొచ్చింది. సోషల్ మీడియాలో ఈ అమ్మడి ఫోటోలు రెగ్యులర్‌గా వైరల్ అవుతూ ఉంటాయి. దాదాపుగా 4.4 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న మాళవిక మోహనన్ బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ స్థాయిలో అందాల ఆరబోత చేస్తూ అంతకు మించి అన్నట్లు ప్రేక్షకులను అలరిస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి తన స్కిన్ షో చేయకుండా సాంప్రదాయబద్ధమైన ఫోటోలతో ఆకట్టుకుంది. ముద్దుగుమ్మ మాళవిక మోహనన్ పట్టు చీరలో పుత్తడి బొమ్మ మాదిరిగా కనిపించి ఆకట్టుకుంది. ఈసారి చాలా స్పెషల్ అన్నట్లు ఈ ఫోటోల్లో కనిపిస్తోంది. తెలుగులో ఈ అమ్మడు రాజాసాబ్ సినిమాలో నటించడం కోసం దాదాపు రెండేళ్లుగా ఎదురు చూస్తున్నట్లుగా చెప్పుకొచ్చింది. ప్రభాస్‌తో సినిమా కోసం ఎదురు చూస్తున్న ఈ అమ్మడు వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. మొన్నటి వరకు రాజాసాబ్ సినిమాలో నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించని మాళవిక మోహనన్ ఈమధ్య కాలంలో తాను ప్రభాస్ సినిమాలో నటిస్తున్నట్లుగా చెప్పుకొచ్చింది. మారుతి దర్శకత్వంలో తాను చేస్తున్న ఈ సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది అంటూ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పడంతో వైరల్ అయ్యింది. రాజాసాబ్ సినిమాలో ప్రభాస్‌కు జోడీగా మాళవిక మోహనన్ మాత్రమే కాకుండా నిధి అగర్వాల్, రిద్ధి కుమార్‌లు సైతం నటిస్తున్నారు. అయినా ఈ అమ్మడి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఈ సినిమాలో నయనతార సైతం కీలక పాత్రలో కనిపించబోతుందనే వార్తలు వస్తున్నాయి. నయనతార ఐటెం సాంగ్‌లో కనిపించబోతుందనే వార్తలు సైతం వస్తున్నాయి. ఏది ఏమైనా రాజాసాబ్ హీరోయిన్ అనగానే ఎక్కువగా మాళవిక మోహనన్ పేరు వినిపిస్తుంది. కనుక రాజాసాబ్ తర్వాత టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి. బాక్సాఫీస్ వద్ద రాజాసాబ్ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటే మాళవిక మోహన్ కి మరిన్ని తెలుగు సినిమాలతో పాటు హిందీలోనూ ఆఫర్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయి.



EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com